ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 130, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 11, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం

1.80 లక్షల ఎకరాల్లో భారీ నగరం

- ఏడు మండలాలు.. 71 గ్రామాల పరిధిలో భారీ ప్రణాళిక
- ప్రణాళిక రూపొందించిన సింగపూర్ సంస్థ 'డీపీ ఆర్కిటెక్ట్స్'
- లైఫ్ సైన్సెస్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ వంటి ప్రత్యేక జోన్ల ఏర్పాటు
- భూముల జోనింగ్‌పై రైతులు, యజమానుల్లో నెలకొన్న ఉత్కంఠ
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ హబ్‌లకు పెద్దపీట!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం దక్షిణ కారిడార్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ప్రపంచ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ బృహత్ ప్రణాళిక పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పర్యవేక్షణలో, సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ డీపీ ఆర్కిటెక్ట్స్ ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. సుమారు 867 చదరపు కిలోమీటర్లు.. అంటే దాదాపు 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఈ నగరం రూపుదిద్దుకోనుంది. పరిశ్రమలు, వాణిజ్యం, ఉన్నత విద్య, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన జీవన ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు.

2లో..

కాలుష్యంలోనూ విశ్వగురువులమేనా.?

- మోదీ ప్రభుత్వంపై ఖర్గే విమర్శలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)దేశ రాజధాని ఢిల్లీలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వాయు కాలుష్యంలో ఢిల్లీ విశ్వగురువుగా ఎందుకు మారుతోందని ప్రశ్నించారు. కాలుష్యం కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. దీపావళి అనంతరం పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం వల్ల ఢిల్లీలో కాలుష్య స్థాయిలు

2లో..

భారత్ సమ్మిట్‌కు హాజరుకండి

- రాహుల్ గాంధీకి టీపీసీసీ చీఫ్ ఆహ్వానం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో చర్చించినట్లు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఢిల్లీలోని 10 జన్ పత్ లో రాహుల్ గాంధీతో సమావేశమైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్‌తో పాటు సర్ వ్యతిరేక సభ, మెగా బీసీ ర్యాలీలో పాల్గొనాల్సిందిగా రాహుల్‌ను వ్యక్తిగతంగా ఆహ్వానించామని మహేష్ గౌడ్ తెలిపారు. ఇటీవల తెలంగాణ మంత్రులు, ఎంపీల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు లేదా ఢిల్లీ వేదికగా జరిగిన పరిణామాలపై రాహుల్‌తో ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ చేపడుతున్న సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్వహిస్తున్న విభిన్న కార్యక్రమాల పురోగతిపై కూడా రాహుల్ గాంధీతో సమగ్రంగా చర్చించినట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్'కు రాహుల్ హాజరవుతున్నారని, ఈ సందర్భంగా గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా ఆయన సూచించారని టీపీసీసీ చీఫ్ తెలిపారు.

2లో..

గర్వంతో విర్రవీగిపోవద్దు, భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి

- మంత్రులకు సీఎం చంద్రబాబు క్లాస్




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయంతో గర్వంతో విర్రవీగిపోవద్దు, ఒద్దికగా ఉండాలి అని సూచించారు. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి, ఇకపై మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి అని సూచించారు. ప్రజలకు

2లో..

భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో రిలయన్స్ డేటా సెంటర్

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ - కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదం
- కీలక పరిపాలనా నిర్ణయాల దిశగా కేబినెట్ సమావేశం





అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భీమిలిలోని అమనం సమీపంలో రూ.31,387 కోట్లతో ఏఐ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటుకు క్యాబినెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని ద్వారా సుమారు 1,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. అలాగే, భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు 24.96 ఎకరాలు, నాయుడుపేటలో రూ.4,000 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటుకు భూ కేటాయింపులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతిలో

2లో..

పోలీసుల నిబద్ధతే ప్రభుత్వ ప్రతిష్టకు గీటురాయి

- ప్రొబెషనరీ డీఎస్పీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్బోధ



- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్న సీఎం రేవంత్
- బాధితుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి
- మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి
- అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లోనూ 562 గ్రూప్-1 నియామకాలు పూర్తి చేశాం
- కొత్తగా ఎంపికైన 119 మంది డీఎస్పీలకు శిక్షణ పూర్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోలీసు అధికారుల పనితీరే ప్రభుత్వ ప్రతిష్టకు గీటురాయిగా మారుతుందని, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే రాష్ట్రానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన, ప్రభుత్వం లేదనే విమర్శలు వస్తాయని, శాంతిభద్రతలు

2లో..

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన సమగ్ర భూ రీసర్వే

- సమగ్ర భూ సర్వే పురోగతిపై పొంగులేటి సమీక్ష - ప్రతి అంగుళం భూమికి కచ్చితమైన సరిహద్దులు
- ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సమగ్ర భూ రీ సర్వే వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో

2లో..

కృష్ణా జలాలపై న్యాయపోరుకు సిద్ధం

- సుప్రీంకోర్టులో తెలంగాణ వాదన బలంగా వినిపించాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు న్యాయపోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో నెలకొన్న

2లో..

తెలంగాణపై బీజేపీ ఫోకస్



- రంగంలోకి అగ్రనేతలు, అధికారనికై వ్యూహాత్మక అడుగులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో బీజేపీ మరింత బలపడేందుకు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వ్యూహాత్మకంగా పక్కాగా ప్లాన్ వేస్తోంది.బీజేపీని గ్రామీణ స్థాయి నుంచి ప్రతీ ఇంటికి చేరువ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయ నేతలు తెలంగాణ రాష్ట్రంపై దృష్టి సారించి ప్రత్యేక పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించగా తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. నవంబర్ 18న ఆయన కరీంనగర్?కు రానున్నారు. 'సర్' పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నిర్వహించే పాదయాత్రకు హాజరై ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. తొలిసారిగా కరీంనగర్ రానున్న నేపథ్యంలో కనీవినీ ఎరగని రీతిలో "మహా పాదయాత్ర'కు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ఈ మహాపాదయాత్రను సక్సెస్ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించేందుకు ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో కేంద్రహోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు.'మహా పాదయాత్ర' నిర్వహించాలని కేంద్రహోంశాఖ మంత్రి బండి సంజయ్ సిద్ధమయ్యారు.

2లో..

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు

- సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

2లో..

తెలంగాణపై చలి పంజా

- చలిగాలుల హెచ్చరికలు, 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

2లో..

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం

ఏడు మండలాలు.. 71 గ్రామాలు

ఫ్యూచర్ సిటీ పరిధిలో రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, మంచాల, మహేశ్వరం, ఆమన్‌గల్ మండలాల్లోని మొత్తం 71 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతం అస్తవ్యస్తంగా విస్తరించకుండా క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి వీలుగా మాస్టర్ ప్లాన్‌లో ప్రత్యేక నిబంధనలు రూపొందించారు. వ్యవసాయ భూముల పరిరక్షణ, నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక అవసరాలకు ప్రత్యేక జోన్లను కేటాయించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం, చెరువులు, ఇతర జలవనరుల రక్షణకు బఫర్ జోన్లను సైతం నిర్దేశించారు. అయితే తమ భూములు ఏ జోన్ పరిధిలోకి వస్తాయన్న అంశంపై రైతులు, భూ యజమానుల్లో ఆసక్తితో పాటు ఉత్కంఠ నెలకొంది.

ఏఐ సిటీ.. లైఫ్ సైన్సెస్ హబ్

ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేలా వివిధ రంగాలకు ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాలతో కూడిన లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ హబ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఈవీ పార్క్, భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలో ప్రాధాన్యం కల్పించారు. వీటితోపాటు గ్రీన్ ఎనర్జీ హబ్‌లను అభివృద్ధి చేయనున్నారు. యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

రతన్ టాటా మార్గ్‌తో రవాణా సదుపాయాలు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రవాణా మౌలిక వసతులకు కీలక స్థానం కల్పించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని రావిర్యాల నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డులోని ఆమన్‌గల్ వరకు 41.5 కిలోమీటర్ల మేర 300 అడుగుల (100 మీటర్లు) వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్–1 నిర్మిస్తున్నారు. ఈ రహదారికి రతన్ టాటా మార్గ్‌గా పేరు పెట్టారు. మరోవైపు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా రాకపోకలు సాగించేందుకు హైదరాబాద్ మెట్రో ఫేజ్–2బీ కింద సుమారు 40 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ రహదారి, మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే నగరానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

నెట్‌జీరో నగరంగా అభివృద్ధి

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో కార్బన్ సిటీగా నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాలుష్యాన్ని తగ్గిస్తూ గ్రీన్ ఎనర్జీ వినియోగం, స్థిరమైన పట్టణాభివృద్ధికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే అంతర్జాతీయ సాంకేతిక సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాల నుంచి భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా రాష్ట్రంలోని యువతకు లక్షలాది ఉన్నత స్థాయి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తోంది.

తెలంగాణ ఆర్థిక ప్రగతికి మరో మైలురాయి

హైదరాబాద్ పాత నగరం, హైటెక్ సిటీ తరహాలో ఫ్యూచర్ సిటీ కూడా తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రంగా ఎదగనుందని ప్రభుత్వం ఆశిస్తోంది. సాంకేతికత, పరిశ్రమలు, విద్య, వైద్యం, వాణిజ్యం వంటి రంగాలను ఒకే చోట సమన్వయం చేస్తూ నిర్మించనున్న ఈ నగరం భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధికి మూడో అతిపెద్ద పవర్‌హౌస్‌గా నిలవాలన్నది ప్రభుత్వ సంకల్పం.

కాలుష్యంలోనూ విశ్వగురువులమేనా.?

విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యానించారు.

నిబంధనలను కఠినంగా అమలు చేయాలి

2026 నాటి ఆర్‌టీఐ వివరాల ప్రకారం, ఢిల్లీ పర్యావరణ నష్టపరిహార వసూళ్లలో దాదాపు 60 శాతం, అంటే సుమారు రూ. 1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయని అన్నారు. 2025 డిసెంబర్ వరకు విడుదల చేసిన జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమ నిధుల్లో ఢిల్లీ కేవలం 17 శాతాన్ని మాత్రమే వినియోగించుకుందని ఆరోపించారు. మరోవైపు, కాలుష్య సంక్షోభాన్ని దీటుగా ఎదుర్కోవడానికి వివరణాత్మక నివేదికలు, ప్రతిపాదిత చర్యలను సమర్పించేందుకు బీజేపీ పాలిత ఢిల్లీ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లకు సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చిందని ఖర్గే గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఇదే విషపూరిత పొగమంచు పునరావృతమవుతోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా నిధులు ఖర్చు చేసి, ఉద్గారాలను తగ్గించి, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కీలక నిర్ణయం తీసుకున్న పార్లమెంటరీ కమిటీ

ఇదిలా ఉండగా, ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతం తీవ్రమైన వాయు కాలుష్యంతో సతమతమౌతున్న నేపథ్యంలో, పార్లమెంటరీ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 17న జరగనున్న తన సమావేశ ఎజెండా నుంచి వాయు కాలుష్య నియంత్రణ అంశాన్ని తొలగించాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించింది. అయితే, దేశ రాజధానిలో కాలుష్య ముప్పు తీవ్రతరమౌతున్న నేపథ్యంలో ఈ కీలక అంశాన్ని పక్కన పెట్టడంపై కాంగ్రెస్ సభ్యుడు అజయ్ మాకెన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కమిటీ ఛైర్‌పర్సన్ రాధా మోహన్ దాస్ అగర్వాల్‌కు లేఖ రాశారు. ఈ విషయంపై సంప్రదించగా, అగర్వాల్ తనకు అజయ్ మాకెన్ రాసిన లేఖ గురించి తెలియదని సమాధానం ఇచ్చారు. సవరించిన ఎజెండాలో కాలుష్య అంశాన్ని ఎందుకు తొలగించారని అడగ్గా, తాను కమిటీ సమావేశాలకు సంబంధించిన విషయాలను బహిరంగంగా చర్చించనని అగర్వాల్ చెప్పారు. కాగా, ఢిల్లీలో వాయుకాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు కూడా ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చడంపై ఆంక్షలు విధించింది. నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించింది.

భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో రిలయన్స్ డేటా సెంటర్

రూ.700 కోట్లతో డిక్సన్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటుకు క్యాబినెట్‌లో ఆమోద ముద్ర వేశారు. విజయవాడలో 15 మెగావాట్లతో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపారు. రాంబిల్లిలో ఏప్యాక్ డేటా సెంటర్ అదానీ క్లౌడ్ హబ్ ప్రతిపాదన పరిశీలనకు ఆమోదం తెలిపారు. రవళి స్పిన్నర్స్ విస్తరణకు రూ.237 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాటీ గ్రీన్ ఎనర్జీకి ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్ న్యూజిలాండ్ ల్యాబోరేటరీస్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో 'హెటిరో గ్రూప్'నకు 173.82 ఎకరాల కేటాయింపు, అన్నమయ్య జిల్లాలో 'స్కెచర్స్ గ్రూప్' ద్వారా 56.82 ఎకరాల్లో 'ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ పార్క్', ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం 30 ఎకరాల 'ఎఫ్ఎల్ఓ ఇండస్ట్రియల్ పార్క్' ఏర్పాటుకు ఆమోదం లభించింది. నాయుడుపేట ఎస్ఈజడ్ లో గతంలో 'వెబ్‌సోల్ రిన్యూవబుల్స్', 'మెట్రో డెకరేటివ్' కంపెనీలకు చేసిన కేటాయింపులను రద్దుచేయాలని క్యాబినెట్ తీర్మానించారు. అనంతపురం జిల్లా వజ్రకరూరులోని 192.68 ఎకరాల వక్ఫ్ భూమిలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు ఆమోదం తెలిపారు. అలాగే, విశాఖ గ్లోబల్ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, రాష్ట్రానికి మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంపై కూడా క్యాబినెట్‌లో సీఎం హెచ్చరికలు చేశారు. ఈ గెలుపుతో విర్రవీగొద్దని, మరింత బాధ్యతయుతంగా పనిచేయాలని సీఎం సూచించారు.

గర్వంతో విర్రవీగిపోవద్దు, భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి

మేలు చేయడమే లక్ష్యంగా పనిచేయాలి అని దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేస్తున్నాం అని చెప్పుకొచ్చారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి, సమష్టిగా ముందుకు వెళ్లాలి అని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో మంత్రివర్గ సమావేశం ముగిశాక రాజకీయ అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో గర్వం తలకు ఎక్కించుకోవద్దని, మరింత బాధ్యతతో పని చేయాలని, టార్గెట్ 2029 లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఏపీ కేబినెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై వాడివేడిగా చర్చించారు. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజార్లలో తక్కువ ధరకు బియ్యం అందిస్తున్నాం అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కూరగాయల ధరలు తగ్గాయి, బియ్యం ధరలు కూడా తగ్గించేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రజలపై ధరల భారం పడకూడదు, ప్రభుత్వం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు ఉపయోగపడాలి అని ముఖ్యమంత్రి సూచించారు. కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో బాగా కృషి చేశారు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

భారత్ సమ్మిట్‌కు హాజరుకండి

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ నవంబర్ నెలాఖరు నాటికి పూర్తవుతుందని మహేష్ గౌడ్ క్లారిటీ ఇచ్చారు. సోనియా గాంధీ జీవిత విశేషాలతో వెలువడిన ఆత్మకథ పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను స్వాగతిస్తున్నామని, ఈ పుస్తకంపై తెలంగాణలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకంపై ఈ భేటీలోనే చర్చించారని ప్రచారం జరుగుతోంది. దాంతో టీపీసీసీ చీఫ్ ఈ ఢిల్లీ పర్యటనతో కొందరు నేతలకు ప్రమోషన్లు దక్కడం, అసంతృప్తులను బుజ్జగించడం ఖాయమని వినిపిస్తోంది.

పోలీసుల నిబద్ధతే ప్రభుత్వ ప్రతిష్టకు గీటురాయి

క్షీణించడంతో పాటు అవినీతి పెరిగిందనే ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అదే పది మంది డీఎస్పీలు నిటారుగా నిలబడి నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే తెలంగాణ ప్రతిష్ట పది రాష్ట్రాల్లో పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. కొత్తగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబెషనరీ డీఎస్పీల నుంచి తాను ఆశిస్తున్నది ఇదేనని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబెషనరీ డీఎస్పీల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శిక్షణ సమయంలో ట్రెయినీలు తీసుకున్న ఛాయాచిత్రాల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా 'నేర స్థలాల ఫోరెన్సిక్ పరిశీలన' కరదీపికను ఆవిష్కరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.

మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దు

కొత్తగా డీఎస్పీలుగా బాధ్యతలు చేపట్టినా, తాము వచ్చిన నేపథ్యాన్ని ఎప్పుడూ మరిచిపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. నేపథ్యాన్ని మరిచిపోయిన రోజు తమ హోదాకు న్యాయం చేయలేరని అన్నారు. ఎక్కడి నుంచి వచ్చినా, ఏ స్థాయిలో ఉన్నా పోలీసు అధికారులుగా ఎదగాలనే లక్ష్యంతోనే ఈ శాఖలోకి వచ్చారని గుర్తుచేశారు. ప్రత్యేకమైన లక్ష్యంతో పోలీసు వ్యవస్థలో చేరిన వారు నిబద్ధత, బలమైన సంకల్పంతో పనిచేస్తే అసాధ్యమంటూ ఏదీ ఉండదని చెప్పారు. లక్ష్య సాధనలో ఇప్పటివరకు సాగిన ప్రయాణం మొదటి అధ్యాయం మాత్రమేనని, ఇప్పుడు రెండో అధ్యాయం ప్రారంభమవుతోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నేరుగా ప్రజలతో మమేకమై పనిచేయాల్సిన బాధ్యత డీఎస్పీలపైనే ఉందన్నారు. వారి పనితీరే ప్రభుత్వానికి గీటురాయిగా మారుతుందని, ఉత్తమ సేవలందిస్తే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు.

పోలీసులపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

సామాన్యుడి నుంచి అత్యున్నత హోదాలో ఉన్న వ్యక్తి వరకు ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తామని చెబుతుంటారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకమే ఇందుకు కారణమన్నారు. గత ఏడు దశాబ్దాలుగా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, సర్వం ఒడ్డి శాంతిభద్రతలను కాపాడిన సీనియర్ పోలీసు అధికారుల సేవల వల్లే ఈ శాఖకు ప్రజల్లో గౌరవం ఏర్పడిందని చెప్పారు. వారి కృషి వల్లే కొత్తగా బాధ్యతలు చేపడుతున్న అధికారులకు గుర్తింపు లభించిందని, ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను పూర్తిగా వినాలని, అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్యను వేగంగా పరిష్కరించాలని ఆలోచించడం కంటే, ముందుగా సమస్య ఏమిటో అర్థం చేసుకోవడం ముఖ్యమన్నారు. సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్లేనని చెప్పారు. సమస్యల పరిష్కారానికి సమయం, వనరులు, సాంకేతిక సహాయం అవసరమని వివరించారు.

మారుతున్న నేరాలకు అనుగుణంగా సిద్ధం కావాలి

కాలానుగుణంగా నేరాల స్వరూపం మారుతోందని, పోలీసులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో నకిలీ సారాయి తయారీ వంటి నేరాలు ఉండేవని, ప్రస్తుతం కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం పోలీసులకు సవాలుగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎంతటి వారున్నా మాదకద్రవ్యాల వ్యవహారాల్లో ఉపేక్షించేది లేదనే లక్ష్యంతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ట్రాఫిక్, ఆహార భద్రత, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు వంటి అనేక కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో నేరగాళ్లు ఎక్కడో ఉండి కూడా మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజల డబ్బును కాజేస్తున్నారని వివరించారు. ఇలాంటి నేరాలను ఎదుర్కోవాలంటే స్పష్టమైన విధానం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు.

నైపుణ్యాలకు అనుగుణంగా విభాగాల ఎంపిక

పోలీసు వ్యవస్థలో అవసరాలకు అనుగుణంగా నేర పరిశోధన విభాగం, అవినీతి నిరోధక శాఖ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. కొత్తగా ఎంపికైన డీఎస్పీలు తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఆయా విభాగాలను ఎంచుకోవాలని సూచించారు. అవసరమైతే మంచి సంస్థల్లో శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పోలీసు శాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంతో ఆశించిన ఫలితాలు రావని, సొంతంగానే నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మాత్రమే విదేశాలకు శిక్షణ కోసం పంపేవారని, ప్రస్తుతం ఉపాధ్యాయులను సైతం శిక్షణకు పంపిస్తున్నామని గుర్తుచేశారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైతే ఒకటి, రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణకు పంపించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

562 గ్రూప్-1 నియామకాలు పూర్తి

అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లోనూ గ్రూప్–1 నియామకాలను పూర్తి చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో గ్రూప్–1 నియామకాలు చేపట్టిన తర్వాత తిరిగి 2025లో నియామకాలు పూర్తిచేశామని చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కూడా ఈ నియామకాలు జరగలేదని గుర్తుచేశారు. డిగ్రీ పూర్తి చేసిన యువత ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో నియామకాల్లో జాప్యం జరగడం బాధాకరమన్నారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ ప్రశ్నాపత్రాల లీకేజీతో ఏర్పడిన గందరగోళ పరిస్థితులు అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి నియామకాలు చేపట్టే బోర్డులో అంతకంటే కిందిస్థాయి వారిని నియమించడం తప్పిదమని వ్యాఖ్యానించారు. రాజకీయ పునరావాసాలకు ఇతర అవకాశాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే నియామకాలు చేపట్టే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇలాంటి తప్పిదాలు జరగడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ అధ్యక్షురాలితో పాటు నిపుణులతో చర్చించి ఉన్నతస్థాయి అనుభవజ్ఞులను నియమించామని వివరించారు. నియామకాలు చేపట్టే వారిలో అనుభవంతో పాటు చిత్తశుద్ధి, బాధ్యతాయుతమైన విధానాలు ఉండాలని, అప్పుడే కమిషన్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఏర్పడుతుందని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 562 ఖాళీలతో గ్రూప్–1 నియామకాలను పూర్తి చేశామని, అందులో 119 మంది డీఎస్పీలుగా ఎంపికయ్యారని ముఖ్యమంత్రి తెలిపారు. నియామకాల ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించిందని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిచిన అధికారులకు పురస్కారాలు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ సమయంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ట్రెయినీ డీఎస్పీలకు ముఖ్యమంత్రి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు

కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు.ద

సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన

సమగ్ర భూ రీసర్వే

లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. 125 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించడానికి ముందుగా ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి పొంగులేటి తెలిపారు. రికార్డుల్లో ఉన్న వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలని చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని తెలిపారు. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలని చెప్పారు. భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సర్వే అనంతరం భూ యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేస్తారు? అభ్యంతరాలను ఎలా నమోదు చేయాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు. సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదని కూడా మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, ఖచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలని చెప్పారు. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. రీసర్వే ప్రారంభ దశలోనే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు, లోపాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని కూడా మంత్రి పొంగులేటి సూచించారు. ఒక్క చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి దారితీయకూడదని సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఖచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ కేటాయింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భూముల వివరాలు, హక్కులు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో ఇకపై కొత్తగా భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని చెప్పారు. ఇక, భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి నిర్ణయించారు.

కృష్ణా జలాలపై న్యాయపోరుకు సిద్ధం

జల వివాదాలకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర ఆధారాలను సిద్ధం చేసి సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలగకుండా న్యాయపరమైన అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అవసరమైన పత్రాలు, ఆధారాలతో న్యాయస్థానంలో వాదనలు వినిపించాలని సీఎం స్పష్టం చేశారు.

డిండి, అచ్చంపేట పనులకు వేగం

డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన విధంగా ఏదుల నుంచి ఈ రెండు పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లాపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి తరలింపునకు ఎక్కడ సొరంగ మార్గాలు అవసరం, ఎక్కడ కాలువలు నిర్మించాలనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. నివేదికకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

కాళేశ్వరంపై ఆచితూచి అడుగులు

కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటిని కూడా పూర్తిస్థాయిలో తరలించలేని పరిస్థితులు ఉన్నాయని, అలాంటప్పుడు అదనపు టీఎంసీ పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించాలని, అనంతరం భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్ర జల సంఘం నుంచి పొందాల్సిన అన్ని అనుమతులను సాధించడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులు, సాంకేతిక అంశాలు, అనుమతుల ప్రక్రియను సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టు పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

తెలంగాణపై బీజేపీ ఫోకస్

గాంధీ సర్కిల్, వైశ్యా భవన్ నుండి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్రలో లక్ష మందితో కలిసి నితిన్ నబిన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బండి సంజయ్ అడుగులో అడుగు వేయనున్నారు. ఈమేరకు మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ వస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణపై చలి పంజా

జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే పలు జిల్లాల్లో రాత్రి వేళల్లో చలి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో చల్లని గాలుల ప్రభావం మరింత ఎక్కువయ్యే సూచనలు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 14.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 14.7 నుంచి 15 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, జనగామ జిల్లాల్లో 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో 18 జిల్లాల్లో 15.1 నుంచి 19.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 16.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తెలంగాణ వైపు తక్కువ ఎత్తులో చల్లని గాలులు వీస్తుండటమే ఉష్ణోగ్రతలు తగ్గడానికి ప్రధాన కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుండటంతో రాత్రి, తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని వాతావరణ శాఖ వెల్లడించింది. పగటి వేళల్లో ఎండ సాధారణంగానే ఉన్నప్పటికీ, సాయంత్రం నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. వేకువజామున పొగమంచు కమ్ముకునే అవకాశం ఉందని.. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో రహదారులపై దృశ్యమానత తగ్గవచ్చని హెచ్చరించారు. వాహనదారులు వేగం తగ్గించి ప్రయాణించాలని, అవసరమైన చోట ఫాగ్ లైట్లు ఉపయోగించాలని సూచిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 16.1 డిగ్రీలుగా నమోదైంది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, శంషాబాద్ వంటి శివారు ప్రాంతాల్లో తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పగటి వేళల్లో మాత్రం వాతావరణం పొడిగా, సాధారణంగా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వర్ష సూచన లేదని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. రాత్రి, తెల్లవారుజామున చల్లని గాలులు ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు వెచ్చని దుస్తులు ధరించడం మంచిది. పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో అనవసర ప్రయాణాలు తగ్గించుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు ముందు వెళ్లే వాహనానికి తగిన దూరం పాటించాలని సూచిస్తున్నారు. మొత్తంగా రాబోయే మూడు రోజులు తెలంగాణలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

నాదెండ్లలో టపాసుల చిచ్చు..

- బీటెక్ విద్యార్థిపై గొడ్డలితో దాడి

నాదెండ్ల రామాపురం కాలనీలో ఆదివారం రాత్రి టపాసుల వేడుకలో వివాదం చోటుచేసుకుంది.పల్లా సుబ్బారావు కాలుస్తున్న టపాసుల నిప్పురవ్వలు పక్కనే ఉన్న బీటెక్ విద్యార్థి నల్లబోతు సాయి ఇంట్లో పడ్డాయి.ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.క్షణికావేశానికి లోనైన నల్లబోతు సాయి గొడ్డలితో పల్లా సుబ్బారావుపై దాడి చేశాడు.ఈ దాడిలో సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు.మెరుగైన వైద్యం కోసం బాధితుడిని గుంటూరు ఆసుపత్రికి తరలించారు.బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్సై వెంకయ్య కేసు నమోదు చేశారు.ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అద్దెకు ఉంటూ.. యజమాని ఇంట్లోనే చోరీ

- నిందితుడి అరెస్ట్.. రూ.3 లక్షల విలువైన 55.200 గ్రాముల బంగారం స్వాధీనం



గుంటూరు: అద్దెకు ఉంటున్న ఇంటి యజమానుల ఇంట్లోనే చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ టి.సీతారాం తెలిపారు. అహ్మద్ నగర్‌లో జరిగిన గృహ దొంగతనం కేసులో నిందితుడు షేక్ మహమ్మద్ రఫీ (28)ను రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన 55.200 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.బాధిత కుటుంబం వైద్య చికిత్స కోసం విశాఖపట్నం వెళ్లిన సమయంలో నిందితుడు ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు 153 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.5 వేల నగదు అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. సాంకేతిక నిఘా, వేలిముద్రల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన సొత్తు రికవరీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ సూచనల మేరకు తన పర్యవేక్షణలో లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్ఐ వెంకటరావు, హెచ్‌సీ ఎం.కల్యాణ్, పోలీసు సిబ్బంది కిరణ్ కుమార్, పి.శంకర్ సమన్వయంతో కేసును ఛేదించినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

శ్రీజ కుటుంబ సభ్యులకు కేటీఆర్ భరోసా

కనగల్ : నల్లగొండ జిల్లా కనగల్ మండలం శాబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కోయ యాదగిరి రెడ్డి– రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2 న అమెరికా బోస్టన్‌లో కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. శ్రీజ బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుంటుంది. ఈ నెల 2వ తేదీన మిత్రులతో పుట్టినరోజు వేడుకకు వెళ్లి తను ఒక్కతే బయటికి వెళ్లింది. ఆ తర్వాత ఆమె మిత్రులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఆచూకీ కనుగొనలేకపోయారు. దాంతో తీవ్ర ఆందోళనలో కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులను నేడు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శాబ్దుల్లాపురం గ్రామంలో పరామర్శించారు. తమను ఏ నాయకుడు పట్టించుకోవట్లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో అక్కడి నుండి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడి ఆ కుటుంబానికి సాయం చేయాల్సిందిగా అర్థించారు. కేటీఆర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భయపడకండి. ధైర్యంగా ఉండండి. ఏమీ కాదు. మీ అమ్మాయి తిరిగి వస్తుంది. వివరాలు ఇవ్వండి. అక్కడ తెలిసిన వారితో మాట్లాడుతానని వారికి కేటీఆర్ భరోసా కల్పించారు. కంచర్లతో తనకు వివరాలు వెంటనే పంపాల్సిందిగా సూచించారు. అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ఫోన్‌లో శ్రీజ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం కంచర్ల మాట్లాడుతూ.. యాదగిరి రెడ్డి దంపతుల ఏకైక కుమార్తె ఆచూకీ లభ్యంగాక వారు పడుతున్న ఆవేదన తనకు బాధ కలిగించిందని, విషయం చెప్పగానే కేటీఆర్ స్పందించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి తన మిత్రుల ద్వారా వారికి సహకారం అందిస్తానని తెలియజేయడం ఆ కుటుంబానికి ఊరట కలిగించిందన్నారు. తాము ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్య, రావుల శ్రీనివాసరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, కడారి కృష్ణయ్య ఉన్నారు.

నాపై వస్తున్న ఆరోపణలను విచారణతో నిగ్గుతేల్చండి

రాష్ట్ర డీజీపీకి అగ్రి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లేఖ

హైదరాబాద్ తనపై వస్తున్న లైగింక వేధింపుల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌కు లేఖ రాశారు. తన ప్రతిష్టను దిగజార్చేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. వాట్సాప్ చాట్‌లు, కాల్ హిస్టరీ వంటి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.విశ్వవిద్యాలయ బదిలీల విధానంలో భాగంగా సెప్టెంబర్ 11, న ఒక మహిళా ఫ్యాకల్టీని నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి బదిలీ చేసినట్లు వీసీ జానయ్య వివరించారు. 12 ఏళ్లుగా అక్కడే పనిచేస్తున్న మరో అధ్యాపకుడి స్థానంలో పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఈ సాధారణ బదిలీ జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ బదిలీ ఇష్టం లేని సదరు మహిళా ఫ్యాకల్టీ కక్షపూరితంగా తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సదరు ఫ్యాకల్టీ, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో తాను వేధింపులకు గురైనట్లు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై 11 నెలల పాటు మౌనంగా ఉండి, బదిలీ జరిగిన తర్వాతే ఫిర్యాదు చేయడం వెనుక ఉన్నది కేవలం కక్షసాధింపు చర్యేనని వీసీ స్పష్టం చేశారు. తాను తెచ్చిన సంస్కరణలు నచ్చని కొందరు స్వార్థపరుల ప్రోద్బలంతోనే ఆమె ఈ అసత్య ప్రచారానికి తెరతీశారని జానయ్య ఆవేదన వ్యక్తం చేశారు.జీవితంలో మొదటిసారి ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కోవడం తనతో పాటు తన కుటుంబ సభ్యులకు ఎంతో బాధ కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డీజీపీని అభ్యర్థించారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్



నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గోదాము పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. గోదాము భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదాము వద్ద నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సీ సెక్షన్ అధికారిని జయసుధ, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ నిర్వాసిత గిరిజన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి'

- జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం - 46 ఎకరాలకు హద్దులు నిర్దేశించిన అటవీ శాఖ అధికారులు

- 13 మంది రైతులకు అధికారుల మొండిచేయి



జూలూరుపాడు, నవంబర్ 10 : సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయి, గత కొన్నేళ్లుగా నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్న జూలూరుపాడు మండలం భోజ్యాతండాకు చెందిన 13 మంది నిర్వాసిత గిరిజన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం అటవీ శాఖ అధికారులు ఆయా రైతుల భూములను పరిశీలించి హద్దులు నిర్దేశించారు. ?2018-19లో సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం కోసం భోజ్యాతండాకు చెందిన పలువురు గిరిజన రైతుల భూములను సేకరించారు.ద

అయితే, ప్రాజెక్టు కాల్వకు ఇరువైపులా ఉన్న ఇతర రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించిన అధికారులు. 13 మంది గిరిజన రైతులకు మాత్రం నేటికీ పరిహారం అందించకుండా నిలిపివేశారు. పరిహారం కోసం బాధితులు గత ఏడేళ్లుగా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారుల పక్షపాత వైఖరి, నిర్లక్ష్యంతో విసిగిపోయిన బాధిత రైతులు చివరకు న్యాయం కోసం జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు.

- ఎస్టీ కమిషన్ ఆదేశాలతో సర్వే

నిర్వాసితుల ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ తక్షణమే స్పందించింది. కమిషన్ ఆదేశాలతో కదిలిన జిల్లా అటవీ శాఖ అధికారులు భోజ్యాతండాలో పర్యటించారు. గిరిజన రైతులు చూపించిన హద్దుల మేరకు సుమారు 46 ఎకరాల భూమిని పరిశీలించి, అధికారికంగా హద్దులను నిర్దేశించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వీరు నాయక్ మాట్లాడుతూ.. గిరిజన రైతుల పట్ల అధికారులు గత ఏడేళ్లుగా చిన్నచూపు చూస్తూ కాలయాపన చేశారని, తద్వారా ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు న్యాయం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు ఈ సందర్భంగా రైతుల పక్షాన ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఇకనైనా జాప్యం చేయకుండా తక్షణమే ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ధారావత్ కాన్షీరామ్, నాయకులు గుగులోత్ కేశవ్, బానోత్ రమేష్‌తో పాటు బాధిత రైతులు శంకర్, రవి, జల, వెంకటరాజు, ధరావత్ చందు, ధరావత్ జ్యోతిబస్, నర్సింహారావు, బోడ భోజ్యా, ధరావత్ రవి, గుగులోత్ రాందాస్, గుగులోత్ బిచ్చా, బానోత్ చిలికి, మౌలాలి, ధరమ్‌సోత్ నక్రు, తాళ్లూరి చిన్న వీరయ్య, పెద్దవీరయ్య పాల్గొన్నారు.

కార్తీక మాసం ఎందుకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు



ఉదయం కార్తీక మాసం భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన, ఆధ్యాత్మిక శక్తితో నిండిన మాసంగా పరిగణించబడుతుంది. చాతుర్మాసంలో చివరి మాసం కావడంతో, శాస్త్రాలు దీనిని అన్ని మాసాలలోకెల్లా శ్రేష్ఠమైనదిగా వర్ణించాయి. "మాసానాం కార్తికః శ్రేష్ఠః" అనే వాక్యం కార్తీక మాసం యొక్క విశిష్టతను తెలియజేస్తుంది. నాలుగు నెలల యోగనిద్ర అనంతరం శ్రీమహావిష్ణువు మేల్కొని, తిరిగి సృష్టి నిర్వహణ బాధ్యతలను స్వీకరించే పవిత్ర కాలం ఇదే. అందువల్ల ఈ మాసంలో ఆచరించే ప్రతి ధార్మిక కార్యం విశేష ఫలితాలను అందిస్తుందని భక్తుల విశ్వాసం.విష్ణు?లక్ష్మీ దేవతల అనంతమైన అనుగ్రహం: ఈ పవిత్ర మాసాన్ని 'దామోదర మాసం' అని కూడా పిలుస్తారు. ఈ సమయంలో శ్రీమహావిష్ణువును, మహాలక్ష్మీ దేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల జీవితంలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, సంపద, ధాన్యసమృద్ధి కలుగుతాయని విశ్వసిస్తారు.

తులసీ పూజ వల్ల అలౌకికమైన ఫలితం:

కార్తీక మాసానికి తులసీదేవికి ఎంతో గాఢమైన సంబంధం ఉంది. ఈ మాసమంతా తులసి మొక్క సమీపంలో దీపం వెలిగించడం, తులసీ వివాహాన్ని నిర్వహించడం వల్ల ఇంట్లో అపారమైన శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం.పాప విముక్తి, ఆత్మశుద్ధి: పద్మ పురాణం, స్కాంద పురాణం వంటి పురాణాల ప్రకారం, కార్తీక మాసం మానవ జీవితంలోని నాలుగు పురుషార్థాలైన ధర్మం, అర్థం, కామం, మోక్షాలను సాధించడానికి అనుకూలమైన పవిత్ర కాలం. ఈ మాసంలో తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించడం వల్ల మనస్సు, ఆత్మ శుద్ధి చెంది ఆధ్యాత్మిక ఉన్నతి కలుగుతుందని విశ్వసిస్తారు.పండుగల మహాసంగమం: కర్వా చౌత్‌లో ప్రతిబింబించే అచంచలమైన ప్రేమ, దీపావళి వెలుగుల వైభవం, గోవర్ధన పూజలోని భక్తిశ్రద్ధలు, భాయీ దూజ్‌లోని ఆప్యాయత, ఛఠ్ పూజలోని దృఢమైన సంకల్పం వంటి అనేక విశిష్ట పండుగలు ఈ మాసాన్ని ఆనందాలతో నింపుతాయి.

దేవదీపావళి దివ్య వైభవం:

కార్తీక పౌర్ణమి రోజున దేవతలు ఆనందంతో దీపాలు వెలిగించి ఉత్సవం జరుపుకున్నారని పురాణగాథలు వివరిస్తాయి. అందుకే ఈ రోజున గంగానదిలో పవిత్ర స్నానం ఆచరించడం, దీపదానం చేయడం అత్యంత విశిష్టమైన ధార్మిక ఆచారాలుగా పరిగణించబడతాయి.కార్తీక మాసంలోని ప్రధాన పౌరాణిక గాథ ? తారకాసుర వధ, త్రిపుర పౌర్ణమికార్తీక మాసానికి సంబంధించిన అనేక పౌరాణిక గాథలు ఉన్నాయి. ధన్వంతరి జయంతి కథ, యముడు?యమునల కథ, గోవర్ధన పూజ కథ వంటి ఎన్నో కథలు ఈ మాసం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. వీటిలో త్రిపురాసుర సంహార గాథకు, కార్తీక పౌర్ణమి వైభవానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.తారకాసుర వధ, త్రిపురాసురుల కథ:పురాణ కథనం ప్రకారం, తారకాసురుడు అనే శక్తివంతమైన రాక్షసుడు కఠోర తపస్సు చేసి బ్రహ్మదేవుని నుంచి ఒక వరాన్ని పొందాడు. ఆ వరం ప్రకారం, పరమశివుని కుమారుని చేతిలో మాత్రమే తనకు మరణం సంభవించాలి. ఈ వరాన్ని పొందిన తరువాత తారకాసురుడు మూడు లోకాలలోనూ అకృత్యాలకు పాల్పడుతూ, దేవతలను స్వర్గం నుంచి తరిమివేసి తీవ్రంగా హింసించడం ప్రారంభించాడు.తారకాసురునికి తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు బ్రహ్మదేవుని కోసం తపస్సు చేసి మూడు అజేయమైన నగరాలను నిర్మించుకునే వరాన్ని పొందారు. ఈ మూడు నగరాలను 'త్రిపురాలు' అని పిలుస్తారు. అవి బంగారం, వెండి, ఇనుములతో నిర్మించబడి, అంతరిక్షంలో సంచరించే శక్తిని కలిగి ఉండేవి.ఆ వరం ప్రకారం, వెయ్యి సంవత్సరాలకు ఒకసారి మాత్రమే ఆ మూడు నగరాలు ఒకే సరళరేఖలోకి వచ్చేవి. అప్పుడు మాత్రమే వాటిని ఒకే బాణంతో నాశనం చేయడం సాధ్యమయ్యేది.రాక్షసుల అకృత్యాలతో తీవ్రంగా బాధపడిన దేవతలందరూ పరమశివుని శరణు వేడుకున్నారు. దేవతలను రక్షిస్తానని శివుడు వారికి అభయమిచ్చాడు.కార్తీక పౌర్ణమి రోజున ఆ మూడు నగరాలు ఒకే సరళరేఖలోకి వచ్చినప్పుడు, పరమశివుడు తన దివ్య ధనుస్సును ధరించి, ఒకే బాణంతో ఆ మూడు నగరాలను భస్మం చేశాడు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందజేసిన ఆశాకార్యకర్తలు

- డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె



రాజన్న సిరిసిల్ల ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్(అఐఉ)సిఐటీయు ప్రకటించింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా సి ఐ టీ యు కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో వేములవాడ, చందుర్తి, కోనరావుపేట పీహెచ్‌సీల పరిధిలోని ఆశా కార్యకర్తలు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, ఆశా వర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో జయశీల, గాయత్రి, జమున, లత, మమత, లక్ష్మీ, అరుణ, జ్యోతి, రత్నమాల, హేమలత, ఉమ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తీవ్రగ్లాంతి



హుస్నాబాద్ సిద్దిపేట– హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందడం పట్ల హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తీవ్రగ్లాంతి వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ ఆయన కుమార్తె మహాన్వి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.పండుగ వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకూతురు ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని పేర్కొన్నారు. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.ప్రమాదంలో గాయపడిన తల్లి త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు.రోడ్డు ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ సూచించారు.

అంగన్వాడీల పోషకాహారం

ఎంతో మేలు

- అంగన్వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన



రాజన్న సిరిసిల్ల అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంతో పిల్లలు, గర్భిణులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.గంభీరావుపేట మండలం గజసింగవరంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల పేరిట కార్యక్ర మాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రానికి ఎంత మంది పిల్లలు వస్తున్నారో ఆరా తీసి.. వారి ఎత్తు, బరువు చూసి.. ఆరోగ్య కార్డుల్లో వివరాలు నమోదు చేసిన తీరును పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మందులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. పలువురు గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, నువ్వులు బాలామృతం తో . సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగిస్తున్నామని, కేంద్రాల్లో సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. సామ్, మామ్ పిల్లలపై సర్పంచ్, అంగన్వాడీ కేంద్రం బాధ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు తయారు చేసిన బాలామృతం, బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బాలామృతం ప్లస్ తో పిల్లలకు ఇష్టమైన ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. నీరు వేడి చేసి చల్లారిన తర్వాత ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. పిల్లల ఆరోగ్యం, చదువు భవిష్యత్తు తల్లితండ్రుల ఇద్దరి బాధ్యతని పేర్కొన్నారు. సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. × ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలిగర్భిణులు బాలింతలు మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పోషకాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. × ఎదుగుదల లోపించిన పిల్లలకు వైద్యం అందించాలి5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడలేని పిల్లలు, రక్తహీనత, పోషకాహారం లోపం గల పిల్లలను బాల భరోసా కింద అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి ..ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటు లో ఉంటారని వెల్లడించారు సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఉన్నత వైద్య సేవలు కరీంనగర్, హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హనుమంతు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల తదితరులు పాల్గొన్నారు.

భూమిని కాపాడితేనే భవిష్యత్తుకు భరోసా

- ఖేత్ బచావో అభియాన్‌లో అధికారుల పిలుపు



నంద్యాల భూసార క్షీణతను అరికట్టి భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ఏఆర్ఎస్ పరిశోధన సంచాలకురాలు డా. వి. జయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం, పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. శ్యామ్ రాజ్ నాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో భూసారాన్ని పరిరక్షించాలని రైతులకు సూచించారు.అనంతరం ఖేత్ బచావో పుస్తకాన్ని ఆవిష్కరించి రైతులకు భూసార ఆరోగ్య పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఐఎఫ్ఎన్ సమన్వయకర్తలు కె. బాల మద్దిలేటి, డి. సూరిబాబు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

నరసరావుపేట పల్నాడు జిల్లా నరసరావుపేట గుంటూరు బైపాస్ రైల్వే బ్రిడ్జిపై కొద్దిసేపటి క్రితం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరూ ఫిరంగిపురం గ్రామానికి చెందిన ముస్లిం యువకులుగా సమాచారం. మృతుడు నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్ పాసుల జారీ విభాగంలో పనిచేస్తుండగా, గాయపడిన వ్యక్తి లైఫ్‌లైన్ ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విశాఖకు ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు

- పెట్టుబడుల పండుగకు సాగరతీరం ముస్తాబు
- నేటి నుంచే అంతర్జాతీయ ప్రతినిధులతో చంద్రబాబు వరుస భేటీలు
- 12, 13 తేదీల్లో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్--2026
- అమిత్ షా చేతుల మీదుగా సదస్సు ప్రారంభం
- సింగపూర్ నుంచి రష్యా వరకు.. ఆరు దేశాల ప్రతినిధుల భాగస్వామ్యం
- స్పేస్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి



అమరావతి(ప్రశ్న న్యూస్) సాగరతీరం విశాఖపట్నం అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా మారబోతోంది. ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలకు ఆతిథ్యమిచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. పెట్టుబడులే లక్ష్యం.. పరిశ్రమలే ప్రాధాన్యం.. ఉపాధి కల్పనే ధ్యేయంగా ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖలో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్--2026కు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రపంచ దేశాల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, అంతర్జాతీయ దౌత్యవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు ఒకే వేదికపైకి రానుండటంతో ఈ సదస్సుపై పారిశ్రామిక వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. సదస్సు ప్రారంభానికి ఒకరోజు ముందుగానే అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామిక సంస్థల అధినేతలతో వరుస సమావేశాలకు సిద్ధమయ్యారు.

పెట్టుబడుల వేటలో ఏపీ.. అంతర్జాతీయ వేదికగా విశాఖ..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు రాష్ట్ర పారిశ్రామిక ప్రస్థానంలో కీలక ఘట్టంగా నిలవనుంది. గతేడాది జరిగిన భాగస్వామ్య సదస్సుకు భిన్నంగా ఈసారి రంగాలవారీగా, ప్రాంతాలవారీగా పెట్టుబడి అవకాశాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహించగా సుమారు రూ.86 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం వెల్లడించింది. ఆ అనుభవంతో ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

తయారీ పరిశ్రమలు, ఆటోమొబైల్, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి కీలక రంగాల్లో ఉన్న అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు వివరించనున్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, పారిశ్రామిక భూములు, రవాణా సదుపాయాలు, పోర్టులు, లాజిస్టిక్స్, నైపుణ్యమున్న మానవ వనరుల అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించనుంది.

అమిత్ షా రాకతో సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం..

నవంబర్ 12న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సదస్సు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ సదస్సును ప్రారంభించనున్నారు. అనంతరం వివిధ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సమావేశాలు, చర్చా కార్యక్రమాలు జరగనున్నాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆయా సమావేశాల్లో పాల్గొని పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశాల్లో పాల్గొని రాష్ట్ర పారిశ్రామిక విధానాలను వివరించడంతో పాటు పెట్టుబడిదారుల సందేహాలకు సమాధానాలు ఇవ్వనున్నారు. కేవలం పెట్టుబడుల ప్రకటనలకే పరిమితం కాకుండా పరిశ్రమల స్థాపన, అమలు, ఉపాధి కల్పన వరకు కార్యాచరణ సాగాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

ఆరు దేశాల ప్రతినిధులతో చంద్రబాబు మంతనాలు..



ఈ సదస్సులో అంతర్జాతీయ భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల దేశాలకు చెందిన ప్రభుత్వ



ప్రతినిధులు, దౌత్యవేత్తలు పాల్గొననున్నారు. ఆయా దేశాలతో వాణిజ్య సంబంధాలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పెట్టుబడుల అవకాశాలపై చర్చలు జరగనున్నాయి.

సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. జపాన్ రాయబారి కీచి ఒనో, రష్యా రాయబారితోనూ చర్చలు జరపనున్నారు. ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్‌తో సమావేశం కూడా ఈ పర్యటనలో కీలకంగా నిలవనుంది. అంతర్జాతీయ పెట్టుబడులు, మేధోసంపత్తి హక్కులు, ఆవిష్కరణలు, పరిశోధన రంగాల్లో సహకారంపై చర్చించే అవకాశం ఉంది.

అంతరిక్ష రంగంపై ప్రత్యేక గురి.. స్టార్టప్‌లకు పెద్దపీట..

ఈసారి సీఐఐ సమ్మిట్‌లో అంతరిక్ష సాంకేతిక రంగం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమలు, రాకెట్ తయారీ, ఉపగ్రహ సాంకేతికత, అంతరిక్ష పరిశోధనల్లో రాష్ట్రానికి ఉన్న అవకాశాలను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. హోథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ వంటి భారతీయ ప్రైవేటు అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.భవిష్యత్తులో అంతరిక్ష పరిశ్రమలకు అవసరమైన తయారీ యూనిట్లు, పరిశోధన కేంద్రాలు, సాంకేతిక సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేలా అవకాశాలను పరిశీలించనున్నారు. జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ చైర్మన్‌తోనూ సీఎం చర్చించనున్నారు. సాంప్రదాయ పరిశ్రమలతో పాటు అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ఏపీకి గుర్తింపు తీసుకురావాలన్నది ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

కియా నుంచి రెన్యూ వరకు.. కార్పొరేట్ దిగ్గజాల సందడి..

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక వేదిక...

పెట్టుబడుల సదస్సుతో పాటు మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ 'విమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్--2026' నిర్వహించనున్నారు. విశాఖలోని నోవోటెల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. మహిళల ఆర్థిక స్వావలంబన, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, మహిళా స్టార్టప్‌లకు ప్రోత్సాహం, వ్యాపార రంగంలో ఎదురయ్యే సవాళ్లు, నూతన అవకాశాలపై చర్చించనున్నారు. మహిళలను ఉద్యోగార్థులుగానే కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

కేంద్రమంత్రులతో వరుస భేటీలు.. రాష్ట్ర ప్రయోజనాలపై చర్చలు...

రెండు రోజుల సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్రమంత్రులతోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్ తదితరులతో చర్చలు జరపనున్నారు. రాష్ట్రంలో రహదారులు, రవాణా, పరిశ్రమలు, వాణిజ్యం, ఇంధనం, పోర్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర సహకారంపై చర్చించనున్నారు.అంతర్జాతీయ పరిణామాల ప్రభావం రాష్ట్రంలోని వివిధ పారిశ్రామిక రంగాలపై ఎలా పడుతోంది? వాటిని అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎలాంటి సహకారం అవసరం? వంటి అంశాలను కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ఒకరోజు ముందుగానే చంద్రబాబు కార్యాచరణ..

సదస్సు ప్రారంభానికి ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం అమరావతిలో సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో భేటీ కానున్నారు. అనంతరం విశాఖ చేరుకుని డబ్ల్యూఐపీఓ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో సమావేశమవుతారు.

అదే రోజు సాయంత్రం ప్రముఖ సంస్థల సీఈవోలతో ప్రత్యేక సమావేశంలో పాల్గొని, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు ఏర్పాటు చేసిన స్వాగత విందులో పాల్గొంటారు. ఈ ముందస్తు భేటీల ద్వారా సదస్సులో చర్చించాల్సిన అంశాలపై స్పష్టత తీసుకురావడంతో పాటు పెట్టుబడుల అవకాశాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రకటనల నుంచి పరిశ్రమల స్థాపన వరకు.. అసలైన పరీక్ష..

విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ దేశాల ప్రతినిధుల రాక, కార్పొరేట్ దిగ్గజాల భాగస్వామ్యం, కేంద్ర మంత్రుల పాల్గొనడం రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడుల వేదికను కల్పించనుంది. అయితే ఈ సదస్సు విజయాన్ని కేవలం ఒప్పందాలు, పెట్టుబడి ప్రకటనలతోనే కొలవలేం. ప్రకటించిన పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చడం, పరిశ్రమలు ఏర్పాటవడం, స్థానిక యువతకు ఉద్యోగాలు లభించడం, ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడమే అసలైన విజయానికి కొలమానాలు కానున్నాయి.

25 కుటుంబాలకు కంటిమీద కునుకు కరువు

- పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో '404' వివాదం.. ఉమ్మడి హక్కులకు గండం
- తాగునీటి పైపులు ధ్వంసం.. కామన్ ఏరియాలో అక్రమ ఏర్పాట్ల ఆరోపణలు
- దళిత మహిళా వాచ్‌మెన్‌పై కుల దూషణ ఫిర్యాదు
- జీఎంసీకి నివాసితుల నిలదీత



గుంటూరు(ప్రశ్న న్యూస్) బ్రాడీపేట ఒక అపార్ట్‌మెంట్.. 25 కుటుంబాలు.. కానీ ఒకే ఫ్లాట్ చుట్టూ తిరుగుతున్న వివాదాలు ఉమ్మడి స్థలాల ఆక్రమణ నుంచి తాగునీటి పైపుల ధ్వంసం వరకు.. భవనంలో నిర్మాణ మార్పుల నుంచి మహిళా వాచ్‌మెన్‌పై కుల దూషణ ఆరోపణల వరకు.. బ్రాడీపేటలోని పృథ్వీ అపార్ట్‌మెంట్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఫ్లాట్ నంబర్ 404 యజమానుల తీరుతో మిగిలిన నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అపార్ట్‌మెంట్ వాసులు ఆరోపిస్తున్నారు. సమస్యను ప్రశ్నిస్తే బెదిరింపులు, దురుసు ప్రవర్తన ఎదురవుతోందని వాపోతున్నారు. మరోవైపు ఫిర్యాదులు అందుతున్నా గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

పాత భవనంలో భారీ మార్పులు.. భద్రతకు ముప్పు..

1993లో నిర్మించిన పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో 2024లో ఫ్లాట్ నంబర్ 404ను బీనా లిటిన్, ఆమె భర్త లిటిన్ కొనుగోలు చేసినట్లు నివాసితులు చెబుతున్నారు. ఆ తర్వాత భారీ డ్రిల్లింగ్ యంత్రాలతో గోడలకు రంధ్రాలు చేయడం, కాంక్రీట్ భాగాలను తొలగించడం వంటి పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణ మార్పులకు జీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ పటిష్ఠతపై నిపుణుల పరిశీలన జరిగిందా? అనేది తేలాల్సి ఉంది.నాలుగో అంతస్తు నుంచి కాంక్రీట్ పెచ్చులు కింద పడుతున్నాయని, భారీ యంత్రాలతో పనులు చేయడం వల్ల భవనం భద్రతపై భయాందోళనలు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ముందస్తు తనిఖీలు చేయాల్సిన అధికారుల బాధ్యత ఏమిటి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

నీటి కోసం నిత్యం పోరాటమేనా..

అపార్ట్‌మెంట్‌లోని తాగునీటి పైపులు నిర్మాణ పనుల సమయంలో ధ్వంసమయ్యాయని, ఇతర ఫ్లాట్లకు ఉప్పునీటి లైన్లు అనుసంధానించారని నివాసితులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెబుతున్నారు. ఒకవైపు భవనంలో నిర్మాణ పనులు.. మరోవైపు తాగునీటి సమస్య.. దీంతో నివాసితుల సహనం నశిస్తోందని తెలుస్తోంది.

ఉమ్మడి స్థలాలపై వ్యక్తిగత పెత్తనమా...

అపార్ట్‌మెంట్ వాసులందరికీ చెందాల్సిన కామన్ ఏరియాలో మూడు భారీ సింటెక్స్ ట్యాంకులు, ప్రత్యేక మోటారు ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నాయి. నాలుగో అంతస్తులోని ఉమ్మడి గేటును తొలగించి సొంత తాళం వేయడంతో ఇతర నివాసితులు, వాచ్‌మెన్ రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని చెబుతున్నారు. ఫ్లాట్ నంబర్ 103కు కేటాయించిన ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.
అపార్ట్‌మెంట్‌లోని టెర్రస్, పార్కింగ్, ఇతర ఉమ్మడి సౌకర్యాలు అందరి హక్కులకు సంబంధించినవి. వాటిపై ఒక ఫ్లాట్ యజమాని ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉందా? అసోసియేషన్ నిబంధనలు అమలుకావా? సంబంధిత అధికారులు ఈ అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మహిళా వాచ్‌మెన్‌పై కుల దూషణ.. ఎవరిస్తారు భరోసా..

వివాదాన్ని ప్రశ్నించిన అపార్ట్‌మెంట్ వాసులపై అసభ్య పదజాలంతో దూషణలు, దాడులకు యత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విధులు నిర్వహిస్తున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళా వాచ్‌మెన్‌ను కులం పేరుతో దూషించి అవమానించారని స్థానికులు ఆరోపించడం ఈ వ్యవహారంలో మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి కోసం పనిచేస్తున్న మహిళపై ఇలాంటి ప్రవర్తనకు పాల్పడితే సహించేది లేదని నివాసితులు అంటున్నారు. ఈ అంశంపై బాధితురాలి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించి, ఘటనకు సంబంధించిన వాస్తవాలను విచారించాలని స్థానికులు కోరుతున్నారు. కుల దూషణ ఆరోపణలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ కావాలంటే బాధితురాలి వాంగ్మూలం, సాక్ష్యాలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలించాల్సి ఉంది.

లిఫ్ట్ కూడా నిర్మాణ పనులకేనా..

ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్యాసింజర్ లిఫ్ట్‌ను నిర్మాణ సామగ్రి, కూలీల రాకపోకలకు వినియోగిస్తున్నారని, నిర్వహణ ఖర్చుల చెల్లింపుల విషయంలోనూ వివాదాలు ఉన్నాయని అపార్ట్‌మెంట్ వాసులు చెబుతున్నారు. లిఫ్ట్ దెబ్బతింటే వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్ నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు, ఖర్చుల విషయంలోనూ స్పష్టత అవసరమని కోరుతున్నారు.

ఫిర్యాదులు పట్టించుకోని జీఎంసీ.. ప్రమాదం జరిగాకే స్పందిస్తారా..

అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె. కలేషా వలి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కనిపించడం లేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేని నిర్మాణాలు జరుగుతున్నాయా? కామన్ ఏరియా ఆక్రమణలు నిజమేనా? భవనానికి ప్రమాదం పొంచి ఉందా? అనే అంశాలపై జీఎంసీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.
అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముడుపుల ఆరోపణలపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, అధికారుల వివరణ ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. జీఎంసీ కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకుని విచారణకు ఆదేశిస్తేనే వాస్తవాలు బయటపడతాయని స్థానికులు ఆశిస్తున్నారు.

ఇది ఫ్లాట్ల మధ్య గొడవ కాదు.. ప్రజల భద్రతకు సంబంధించిన వ్యవహారం..

ఒక ఫ్లాట్ యజమాని చర్యల కారణంగా 25 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్న ఫిర్యాదులను సాధారణ వివాదంగా పక్కనపెట్టలేం. భవన భద్రత, తాగునీటి సరఫరా, కామన్ ఏరియా హక్కులు, మహిళా ఉద్యోగిపై కుల దూషణ ఆరోపణలు.. ప్రతి అంశంపైనా విడివిడిగా విచారణ జరగాలి. జీఎంసీ అధికారులు భవనాన్ని పరిశీలించి నిర్మాణ అనుమతులు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలి. పోలీసులు బాధితుల ఫిర్యాదులపై స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

కార్తీక దీపకాంతుల్లో మల్లేశ్వరుని దివ్య వైభవం

- మంత్రోచ్ఛారణల నడుమ సహస్ర లింగార్చన.. భక్తిభావంతో ఆకాశదీపం- పంచహారతులతో పరమశివునికి మహా నీరాజనం
- సహస్ర దీపాల వెలుగుల్లో ఆధ్యాత్మిక శోభ - విశేష పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)



ఇంద్రకీలాద్రి (ప్రశ్న న్యూస్)కార్తీక మాస పవిత్రత.. శివనామ స్మరణ పరిమళం.. వేదమంత్రాల గంభీర నాదం.. వేలాది దీపాల కాంతులతో ఆధ్యాత్మిక వాతావరణం పరవశించింది. పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తి, శ్రద్ధ, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన ఈ పూజా క్రతువులు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి.ఈరోజు సాయంత్రం ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలు, శైవాగమ సంప్రదాయాల నడుమ సహస్ర లింగార్చన, ఆకాశదీపం, పంచహారతులు, సహస్ర దీపాలంకరణ సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరమేశ్వరుని అనుగ్రహం కోసం నిర్వహించిన ఈ విశేష పూజల్లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు.

సహస్ర లింగార్చన.. శివతత్వానికి ఆరాధన..

కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ఈ పవిత్ర మాసంలో నిర్వహించే సహస్ర లింగార్చన భక్తి పారవశ్యానికి ప్రతీకగా నిలిచింది. అనేక లింగ స్వరూపాల్లో పరమశివుడిని దర్శిస్తూ, మంత్రపూర్వకంగా నిర్వహించిన అర్చన ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణాన్ని నింపింది. ప్రతి మంత్రాక్షరం శివనామ స్మరణను ప్రతిధ్వనింపజేస్తుండగా, ప్రతి అర్చన భక్తుల మనసుల్లో భగవంతునిపై అచంచలమైన విశ్వాసాన్ని మరింత బలపరిచింది.

ఆకాశదీపం.. లోకక్షేమానికి జ్యోతిరారాధన..

కార్తీక మాసంలో ఆకాశదీపానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. సాయంత్ర వేళ ఆకాశదీపాన్ని వెలిగించి పరమేశ్వరుడికి సమర్పించడం ద్వారా లోకక్షేమం, సకల జీవుల



శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించడం సంప్రదాయం. ఆలయంలో నిర్వహించిన ఆకాశదీప సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆకాశాన్ని తాకే జ్యోతిర్మయ కాంతి శివతత్వంలోని అనంతత్వాన్ని, జ్ఞానజ్యోతిని స్మరింపజేసింది.

పంచహారతులు.. పరమేశ్వరునికి మహా నీరాజనం..

శివారాధనలో పంచహారతుల సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీపకాంతుల మధ్య మంగళ వాద్యాలు, మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి సమర్పించిన పంచహారతులు ఆలయ ప్రాంగణాన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. జ్యోతుల వెలుగుల్లో మల్లేశ్వరుని దివ్యస్వరూపం మరింత శోభాయమానంగా దర్శనమిచ్చింది.

సహస్ర దీపాలంకరణ.. వెలుగుల మధ్య శివనామ స్మరణ..



వేలాది దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది. సహస్ర దీపాలంకరణ సేవలో భాగంగా వెలిగించిన దీపాలు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక వెలుగులను నింపాయి. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించాలని పరమశివుడిని ప్రార్థిస్తూ నిర్వహించిన ఈ సేవ కార్తీక మాస మహాత్మ్యాన్ని చాటిచెప్పింది.

భక్తి.. సంప్రదాయం.. ఆధ్యాత్మిక వైభవం..

కార్తీక మాసం కేవలం ఒక మాసం మాత్రమే కాదు.. శివారాధన, దీపారాధన, దైవచింతన, ఆత్మశుద్ధికి ప్రతీకగా నిలిచే పవిత్ర సమయం. ఈ మాసంలో శివాలయాల్లో జరిగే ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి. శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించిన ఈ విశేష సేవలు శైవ సంప్రదాయ వైభవాన్ని మరోసారి చాటిచెప్పాయి. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పూజా క్రతువులో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఓంకార నాదంతో మార్మోగిన ఆలయం.. దీపకాంతులతో వెలిగిన ప్రాంగణం.. వేదమంత్రాలతో పవిత్రమైన వాతావరణం.. భక్తుల హృదయాల్లో నిండిన శివనామ స్మరణ.. వెరసి కార్తీక మాసంలో శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగిన ఈ విశేష పూజలు ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పట్టాయి.

మైలవరంలో కూటమి విజయదుందుభి

- కొండపల్లిలో 40కి 33.. ఐదు మండలాల్లో 73కి 62
- ఐదింటికి ఐదు జెడ్పీటీసీ స్థానాలు కైవసం
- కార్యకర్తల కష్టానికి ప్రజల పట్టాభిషేకం..
- విజయంతో బాధ్యత మరింత పెరిగింది
- పంచాయతీ ఎన్నికలే తదుపరి లక్ష్యం..
- మూడు పార్టీల శ్రేణులకు ఎమ్మెల్యే వసంత పిలుపు

ఐతవరం(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గంలో కూటమి సాధించిన విజయాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొండపల్లి పురపాలక సంఘం నుంచి మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థానాల వరకు కూటమి అభ్యర్థులు సాధించిన విజయాలతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కొండపల్లి మున్సిపాలిటీలో 40 స్థానాలకు గాను 33 స్థానాలు, ఐదు మండలాల్లో 73 ఎంపీటీసీ స్థానాలకు గాను 62 స్థానాలు, ఐదు జెడ్పీటీసీ స్థానాలకుగాను ఐదింటినీ కూటమి కైవసం చేసుకోవడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా నిలిచింది. ఈ విజయోత్సాహం మధ్య మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గెలుపుతో గర్వపడటం కాదు.. బాధ్యతను గుర్తించి ప్రజలకు మరింత చేరువ కావాలని స్పష్టం చేశారు.

కార్యకర్తల చెమటకు విజయ తిలకం..

మైలవరం నియోజకవర్గంలోని ఐతవరం ఎమ్మెల్యే స్వగ్రామంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం విజయోత్సవ సభగా మారింది. తొలుత అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కూటమి తరఫున విజయం సాధించిన మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ.. తన స్వగ్రామంలో జరుగుతున్న ఈ సమావేశం వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఇది కేవలం ఎన్నికల విజయోత్సవం మాత్రమే కాదని, మూడు పార్టీల మధ్య ఉన్న సమన్వయానికి, కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు, ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి ప్రతిబింబమని అభివర్ణించారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి నాయకుల ప్రసంగాల కంటే కార్యకర్తల క్షేత్రస్థాయి కృషి ఎంతో కీలకమని చెప్పారు. ఇంటింటికీ తిరిగి, ఎండనక, వాననక పార్టీ అభ్యర్థుల కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

కొండపల్లిలో 33.. ఐదు మండలాల్లో 62..

మైలవరం నియోజకవర్గంలో కూటమి సాధించిన విజయాలను వివరిస్తూ ఎమ్మెల్యే గణాంకాలను వెల్లడించారు. కొండపల్లి పురపాలక సంఘంలో కూటమి తరఫున పోటీ చేసిన 40 మంది అభ్యర్థుల్లో 33 మంది విజయం సాధించారని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 73 ఎంపీటీసీ స్థానాలకు గాను 62 స్థానాలను కైవసం చేసుకున్నామని, ఐదు జెడ్పీటీసీ స్థానాలనూ ఐదింటినీ గెలుచుకున్నామని వివరించారు.ఈ ఫలితాలు కూటమి పార్టీల మధ్య ఉన్న ఐక్యతను, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేసిన కృషిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విజయాలను ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క నాయకుడికో పరిమితం చేయలేమని, తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయడం వల్లే సాధ్యమైందని అన్నారు. అంతిమంగా ప్రజలు అందించిన విజయంగా అభివర్ణించారు.

గెలుపు సంబరాలు చాలు.. ఇక ప్రజాసేవలోకి దిగండి..



ఎన్నికల్లో సాధించిన విజయాలతోనే సంతృప్తి చెందకుండా ప్రజల మధ్య నిరంతరం ఉండాలని నూతన ప్రజాప్రతినిధులకు వసంత కృష్ణప్రసాదు సూచించారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు తమ పదవులను అధికారంగా కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావించాలన్నారు.

ఎన్నికల సమయంలో ఓటు వేసిన వారితో పాటు ఓటు వేయని వారిని కూడా సమానంగా గౌరవించాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలోకి వెళ్లి ప్రతి ఇంటినీ సందర్శించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, డ్రైనేజీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులుగా కాకుండా, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులుగా గుర్తింపు తెచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు.

మూడు పార్టీల మధ్య చిన్నచిన్న విభేదాలకు తావులేదు..

కూటమి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఉన్న ఐక్యతే పునాది అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. స్థానికంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య చిన్నచిన్న అభిప్రాయ భేదాలు, సమస్యలు ఉండవచ్చని, వాటిని పక్కనపెట్టి కూటమి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.టీడీపీ కార్యకర్త జనసేన కార్యకర్తను, జనసేన కార్యకర్త బీజేపీ కార్యకర్తను, బీజేపీ కార్యకర్త టీడీపీ కార్యకర్తను గౌరవించుకోవాలని అన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడ ఎవరు పోటీ చేయాలన్నది పార్టీ పెద్దలు నిర్ణయిస్తారని, అభ్యర్థి ఎవరైనా కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ఆధిపత్యాలు, స్థానిక విభేదాలు కూటమి ఐక్యతను దెబ్బతీయకూడదని స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికలపై ఇప్పటి నుంచే గురి..

ప్రస్తుత విజయాలు రాజకీయ ప్రస్థానంలో ఒక మైలురాయి మాత్రమేనని, అసలైన బాధ్యత ఇప్పుడు మొదలైందని వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. కొండపల్లిలో 33 కౌన్సిలర్ స్థానాలు, ఐదు మండలాల్లో 62 ఎంపీటీసీ స్థానాలు, ఐదింటికి ఐదు జెడ్పీటీసీ స్థానాలు సాధించడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, ఈ విజయాన్ని అభివృద్ధి బాధ్యతగా మలచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మైలవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.కార్యకర్తల కష్టాన్ని గుర్తించిన నాయకత్వం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన ప్రజాప్రతినిధులు.. ఐక్యతను కాపాడుకోవాల్సిన మూడు పార్టీలు.. ఇదే మైలవరం కూటమి విజయోత్సవ సభ ఇచ్చిన సందేశం.

ఎన్నికల గెలుపు ఒక ఎత్తయితే, ప్రజల మనసుల్లో నిలిచే పాలన అందించడం మరో ఎత్తు. ఆ దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఇచ్చిన పిలుపు ఇప్పుడు నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, జనసేన మైలవరం నియోజకవర్గ బాధ్యుడు అక్కల రామ్మోహనరావు (గాంధీ), మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్ద గట్టు జాతర మూవీ చిత్రం చిత్రీకరణ



ఆర్.కే.రెడ్డి ఫిలిమ్స్ ప్రెసెంట్స్ బ్యానర్ పై విజయకుమార్ దర్శకత్వం లో రామకృష్ణారెడ్డి నిర్మిస్తన్న చిత్రం.. పెద్దగట్టు జాతర... వీరాన్స్.. హీరో గా యువభారతి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం చిత్రికరణను కర్నూల్ దగ్గర లక్ష్మీపురం జగన్నాధగట్టు పాలకొలను బిల్వస్వర్గం గుహలు యాగంటి అలాగే కడప జిల్లా గండికోట ఎర్రగుంట్ల మైనింగ్స్ ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాలలో షూటింగ్ చేస్తున్నామని డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు.. ఈ చిత్రం లో బాహుబలి కాలకేయ ప్రభాకర్.. జబర్దస్త్ ధనరాజ్.. జబర్దస్త్ రాజమౌళి.. అరుంధతి ఫేమ్ మీనాకుమారి.. ఇంకా చాలా బారితారగనం నటిస్తున్నారు.. వీరితో పాటు రాయలసీమ సీమ లోని నూతన నటినటులకు కూడా అవకాశం కల్పిస్తామని డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు.

‘మేడమ్ ఇన్ స్పెక్టర్’ (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!



బెంగాలీలో కొంతకాలం క్రితం ‘బీరాంగన’ (వీరాంగన) అనే టైటిల్ తో ఒక సిరీస్ రూపొందింది. ఆ సిరీస్ ఇప్పుడు ‘మేడమ్ ఇన్ స్పెక్టర్’గా ఓటీటీ ప్రేక్షకులను పలకరిస్తోంది. అక్టోబర్ 17వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. సస్పెన్స్ తో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ను 7 ఎపిసోడ్స్ గా వదిలారు. బెంగాలితో పాటు ఇప్పుడు తెలుగు .. తమిళ .. హిందీ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి వచ్చింది. కోల్ కతాలో చిత్రా బసు (సందీప్తా సేన్) పోలీస్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటుంది. అత్తమామలకు ఆమె జాబ్ చేయడం ఇష్టం ఉండదు. అయినా భర్త సపోర్ట్ తో తన పని తాను చేసుకుంటూ వెళుతూ ఉంటుంది. అప్పుడప్పుడు బాల్యంలో జరిగిన ఒక సంఘటన ఆమె కనులముందు కదులుతూ ఉంటుంది. అప్పుడు ఆమె గుండె బరువెక్కుతూ ఉంటుంది. ఆ సంఘటనను మరిచిపోవడానికి ఆమె చాలా కాలంగా ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. అలాగే తన పైఅధికారి ‘బరల్’ను భరిస్తూ ఉంటుంది. నగరంలో చిత్రమైన మరణాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. పెళ్లి ముహూర్తానికి ముందు పెళ్లికూతుర్లు చనిపోతుంటారు. వాళ్ల మరణానికి కారణం ఏమిటనేది కూడా మిస్టరీగా మిగిలిపోతూ ఉంటుంది. ఈ కేసును సాల్వ్ చేయడం కోసం ధీరజ్ బృందంతో కలిసి చిత్రా బసు రంగంలోకి దిగుతుంది. అమ్మాయికి రెండో పెళ్లి అయినప్పుడు మాత్రమే మరణాలు సంభవిస్తున్నాయనేది ఆమె విచారణలో తేలుతుంది. మరణాలు సంభవించిన పెళ్లి కూతుళ్ల అందరికీ కలిపి కామన్ పాయింట్ ఏమిటనేది ఆలోచన చేస్తుంది. పెళ్లి మంటపంలోనే పెళ్లి కూతురు మరణించిన అన్ని పెళ్లిళ్లకి ఫ్లవర్ డెకరేషన్ చేసింది ఒక్కరేనని .. అతని పేరు ‘చిరాయు’ అనే విషయం తెలుస్తుంది. అతనిని పట్టుకోవడం కోసం తన టీమ్ తో కలిసి చిత్రా బసు రంగంలోకి దిగుతుంది. హంతకుడు ఎవరు? ఎందుకు హత్యలు చేస్తున్నాడు? రెండో వివాహం చేసుకుంటున్న యువతులను ఎందుకు టార్గెట్ చేస్తున్నాడు? అతణ్ణి పట్టుకోవడంలో ఆమె ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది? అనేదే కథ. రెండో వివాహానికి సిద్ధమైన యువతులు, కల్యాణ మంటపంలో కుప్పకూలిపోతుంటారు. హఠాత్తుగా .. అనుమానాస్పదంగా వాళ్ల మరణాలు జరుగుతూ ఉంటాయి. అందుకు కారణం ఏమిటి? జరుగుతున్న మరణాలకు కారకులు ఎవరు? అనే విషయాన్ని తేల్చడానికి పోలీస్ ఆఫీసర్ చిత్రా బసు రంగంలోకి దిగుతుంది. ఆమె ఈ కేసును ఎలా డీల్ చేస్తుందనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. దీని చుట్టూనే ఈ కథ అంతా తిరుగుతూ ఉంటుంది. సాధారణంగా సైకో కిల్లర్ వరుస హత్యలు చేస్తూ వెళుతుంటాడు. అతను ఎవరు? ఎందుకు ఇలా హత్యలు చేస్తున్నాడు? అనే రహస్యాన్ని ఛేదించడానికి పోలీస్ అధికారులు రంగంలోకి దిగుతూ ఉంటారు. కథ క్లైమాక్స్ కి చేరుకుంటూ ఉండగా ఆ సైకో కిల్లర్ ఎవరనేది రివీల్ చేయడం .. ఆడియన్స్ గెస్ కరెక్ట్ కాదని నిరూపించడం సహజంగా జరుగుతూ ఉంటుంది. కానీ ఈ కథలో సాయికి కిల్లర్ ఎవరనేది ముందుగానే చూపించేస్తారు? అతనిని పోలీసులు ఎలా పట్టుకుంటారనేదే ఉత్కంఠను రేకెత్తించే అంశంగా మారుతుంది. మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో .. సైకో కిల్లర్ కథలలో, హత్యలకు హంతకుడు ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అతనిని పట్టుకోవడానికి పోలీసులు ఎలాంటి వ్యూహాలను పన్నుతున్నారు? అనేదే అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తూ ఉంటుంది. అయితే ఈ కథలో ఈ రెండు ప్రక్రియలు చాలా సాధారణంగా జరిగిపోతూ ఉంటాయే తప్ప, నెక్ట్ ఏం జరగబోతోంది? అనే ఒక ఉత్కంఠ మాత్రం ఆడియన్స్ వైపు నుంచి తొంగిచూడదు. ఇక అసలైన విషయం .. హంతకుడు అలా మారడానికి గల కారణం ఏమిటి? అనేది తెలుసుకోవడానికి ప్రేక్షకులు కుతూహలాన్ని కనబరుస్తారు. అందుకు సంబంధించిన కారణం ఫ్లష్ బ్యాక్ గా ఆడియన్స్ ముందుకు వస్తుంది. కాకపోతే అది చాలా రొటీన్ గా అనిపిస్తుంది. ఇక ప్రధానమైన పాత్రను పోషించిన పోలీస్ ఆఫీసర్ చిత్రా బసు ఫ్లష్ బ్యాక్ కూడా చాలా పేలవంగా అనిపిస్తుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులు, తమ పాత్ర పరిధిలో బాగానే చేశారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ జస్ట్ ఓకే అన్నట్టుగా అనిపిస్తాయి. కొన్ని పాత్రల డైలాగ్స్ మాత్రం మ్యూట్ లోనే ఉండిపోయాయి. కథాకథనాల పరంగా పెద్దగా ప్రభావితం చేయలేకపోయిన ఈ కంటెంట్, ఓ మాదిరిగా అనిపిస్తుందంతే.

5 రోజుల్లో రూ. 663 కోట్లు..

బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ‘రామాయణం’!



బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన ‘రామాయణం పార్ట్ 1’ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన రికార్డులను సృష్టిస్తోంది. ఐదవ రోజు సోమవారం నాడు ఈ చిత్రం ఏకంగా రూ. 107.50 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించి, ఇప్పటివరకు ఏ భారతీయ సినిమాకూ సాధ్యం కాని రీతిలో అతిపెద్ద సోమవారం వసూళ్లను నమోదు చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 23,911 షోలతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతకుముందు రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ మొదటి సోమవారం రూ. 60 కోట్ల నెట్ కలెక్షన్లతో సాధించిన రికార్డును ఈ సినిమా తిరగరాసింది. ఈ భారీ వసూళ్లతో ‘రామాయణం పార్ట్ 1’ మొత్తం కలెక్షన్లు ఊహించని స్థాయికి చేరాయి. ఈ చిత్రం యొక్క భారతదేశ గ్రాస్ కలెక్షన్లు రూ. 413.90 కోట్లకు చేరుకోగా, ఇండియా నెట్ కలెక్షన్లు రూ. 346.35 కోట్లకు చేరాయి. సోమవారం ఒక్కరోజే విదేశీ మార్కెట్లలో రూ. 25 కోట్లు రాబట్టడంతో, ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్లు రూ. 250 కోట్లకు చేరాయి. దీనితో ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ. 663.90 కోట్లకు చేరుకున్నాయి. సోమవారం నాడు హిందీ వెర్షన్ మొత్తం 73.6 శాతం ఆక్యుపెన్సీని నమోదు చేసింది. చెన్నైలో అత్యధికంగా 83 షోలకు గాను 94 శాతం ఆక్యుపెన్సీ నమోదు కాగా, బెంగళూరులో 262 షోలకు 90.8 శాతం, హైదరాబాద్‌లో 162 షోలకు 77.5 శాతం, ముంబైలో 939 షోలకు 69.3 శాతం, అలాగే ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో 1,109 షోలకు 72.5 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. కన్నడ, తెలుగు వెర్షన్లు వరుసగా 79.8 శాతం మరియు 52.8 శాతం ఆక్యుపెన్సీని సాధించాయి.

రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 2026 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన మూడవ భారతీయ చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం ఈ జాబితాలో ‘ధురంధర్: ది రివెంజ్’ (రూ. 1,852 కోట్లు), ‘జైలర్ 2’ (రూ. 821 కోట్లు) చిత్రాలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నమిత్ మల్హోత్రా, యశ్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యశ్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతగా నటించగా.. రావి దూబే (లక్ష్మణుడు), అరుణ్ గోవిల్ (దశరథ మహారాజు), ఇందిరా కృష్ణన్ (కౌసల్య), లారా దత్తా (కైకేయి), షీబా చద్దా (మంథర), రకుల్ ప్రీత్ సింగ్ (శూర్పణఖ), కాజల్ అగర్వాల్ (మండోదరి) కీలక పాత్రల్లో మెరిశారు. నవంబర్ 5న విడుదలైన ఈ సినిమా మొదటి పార్ట్ అఖండ విజయం సాధించగా, దీని రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం దానిని 2028కి వాయిదా వేసినట్లు సమాచారం.

ఈగో రాజా ప్రేమాయణం




‘శంబాల’ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత ఆది సాయికుమార్ నటిస్తు న్న తాజా చిత్రం ‘ఈగో రాజా’. గురుశరవణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలు గు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్నది. సోమవారం ఈ చిత్రం నుంచి ‘రౌడీ రాకాసి’ అనే పాటను విడుదల చేశారు. గిబ్రాన్ వైబోధ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రచించారు. శ్రీనివాసన్ ఆలపించారు. వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ఆది పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. సతీష్, శరణ్య రామచంద్రన్, ఆద్య ప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గిబ్రాన్ వైబోధ, నిర్మాత: జి.సురేష్, రచన-దర్శకత్వం: గురు శరవణన్.

ఆ రోజును మరిచిపోలేను



అత్యంత బిజీ బాలీవుడ్ కథానాయికల్లో జాన్వీకపూర్ ఒకరు. దేవర, పెద్ది సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సైతం చేరువైన జాన్వీ.. ప్రస్తుతం లగ్ జా గలే, రాకా సినిమాలతో బిజీగా ఉన్నారు. నిత్యం ఏదో ఒక మాధ్యమం ద్వారా అభిమానులకు, ప్రేక్షకులకు చేరువలో ఉండే జాన్వీ.. తాజా ఇంటర్వ్యూలో తన తల్లి, దివంగత నటి శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ‘కథానాయికగా నా తొలి సినిమా ‘ధడక్’(2018). అయితే.. ఆ సినిమాను ఒప్పుకునే ముందు ఇంట్లో చాలా పెద్ద డ్రామానే నడిచింది.హీరోయిన్‌ని అవుతానని అమ్మకు చెప్పగానే ఒక్కసారిగా ఆమె షాకయ్యింది. ‘అనలు నువ్వు కథానాయికగా సక్సెస్ కాగలవా?’ అంటూ సంకోచించింది కూడా. ఎందుకంటే నా విషయంలో అమ్మకు పెద్ద నమ్మకం ఉండేది కాదు. తాను ఎంతో సంఘర్షణకు లోనైంది. ‘ఈ రంగంలోకి వస్తే నీ జీవితాన్ని పూర్తిగా దీనికే అంకితం చేయాలి’ అని సూటిగా నా కళ్లలోకి చూస్తూ చెప్పింది. ఆ రోజుని ఇప్పటికీ నేను మరిచిపోలేను’ అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్.

శ్రీలత బారాత్ హంగామా



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల మేళవింపుతో రూపొందుతున్న హాస్యభరిత కుటుంబ కథాచిత్రం ‘ఇదుపు కాయితం’. ప్రియదర్శి, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత. డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ సినిమా నుంచి ‘బారాత్ బీట్’ సాంగ్‌ని విడుదల చేశారు. సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అదిరిపోయే బీట్‌తో ఈ పాటను కంపోజ్‌చేశారు. శ్రీలత(నాగదుర్గ), శ్రీనివాస్ (ప్రియదర్శి) పెళ్లి బారత్ సందర్భంగా వచ్చే ఈ డ్యాన్స్ నెంబర్‌లో నాగదుర్గ మాస్ డ్యాన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. శివజ్యోతి, సుజాత, చంద్రవ్వ, మౌనికరెడ్డి, రచ్చ రవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎంఎన్ బాల్‌రెడ్డి, నిర్మాణం: సుకుమార్ రైటింగ్స్, బన్నీవాస్ వర్క్స్.

‘ఇట్లు అర్జున’ చూసి సర్‌ప్రైజ్ అయ్యాను



‘హీరో అనీష్ నాకు ఈ సినిమా గ్లింప్స్ చూపించి వాయిస్‌ఓవర్ ఇవ్వమని అడిగాడు. కథ అడిగాను.. చెప్పాడు. కథలో తను మూగవాడు. ఫస్ట్ సినిమాకే మూగవాడిగా చేయడం అవసరమా? అని అడిగాను. ఎందుకంటే.. రామ్‌చరణ్‌కి డఫ్ క్యారెక్టర్ చేయడానికి పదేళ్లు పట్టింది. ‘రంగస్థలం’లో తను డఫ్‌గా నటించాడు. అఖిల్ కూడా అనుభవం వచ్చాకే ‘లెనిన్’లో బ్లైండ్ క్యారెక్టర్ చేశాడు. కానీ అనీష్‌కి ఇది తొలి సినిమా. సినిమా పూర్తయ్యాక చూపించారు. నిజంగా సర్‌ప్రైజ్ అయ్యాను. అద్భుతంగా చేశాడు. అనీష్ తన కళ్లతో మాట్లాడాడు. నిశ్శబ్దం ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో చెబుతుంది ఈ సినిమా. అనీష్, అనస్వర కెమిస్ట్రీ అద్భుతం. ప్రతి క్రాఫ్ట్ మనసుపెట్టి పనిచేశారు. రేపు అది ప్రేక్షకులు తెరపై చూస్తారు’ అని అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన సమర్పకునిగా రూపొందిన చిత్రం ‘ఇట్లు అర్జున’. అనీష్ కథానాయకుడు. అనస్వర రాజన్ కథానాయిక. మహేశ్ ఉప్పల దర్శకుడు. వెంకీ కుడుముల నిర్మాత. ఈ చిత్ర సంగీత విభావరి సోమవారం హైదరాబాద్‌లో జరిగింది.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాగార్జున పై విధంగా స్పందించారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆగ్ర హీరో రామ్‌చరణ్ మాట్లాడుతూ ‘నాగార్జునగారు ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరవ్వడంతో సినిమాకు బలం చేకూరింది. కొత్త వాళ్లను ఆయన ప్రోత్సహించినంతగా ఎవరూ ప్రోత్సహించలేరు. వెంకీ కుడుములకు, డైరెక్టర్ మహేష్‌కీ, అనస్వరకీ నా శుభాకాంక్షలు. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. తొలి సినిమా ‘చిరుత’లో నేనెలా చేశానో తెలీదుకానీ.. తన తొలి సినిమా అయిన ‘ఇట్లు అర్జున’లో నాకంటే వందశాతం గొప్పగా చేశాడు అనీష్. తనకు బిగ్గెస్ట్ ఫ్యూచర్ ఉంది’ అని నమ్మకంగా చెప్పారు రామ్‌చరణ్. ఇంకా అక్కినేని అఖిల్‌తోపాటు చిత్రబృందమంతా మాట్లాడారు.

తండ్రి పేరు లేకుంటే బిడ్డకు హక్కులు లేవా.?

- ప్రభుత్వ దరఖాస్తుల్లో ఆ నిబంధనకు చెల్లుచీటి

- తల్లి పేరు సరిపోదా.. చట్టపరంగా తప్పనిసరి కానిచోట తండ్రి వివరాలెందుకు.?

- చిన్నారుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారిన అధికారిక నిబంధనలు.?

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



విజయవాడ (ప్రశ్న న్యూస్) తండ్రి పేరు లేకపోతే బిడ్డకు గుర్తింపు లేదా? తల్లి ఒడిలో పెరిగే చిన్నారికి ప్రభుత్వ పథకాలు అందకూడదా? తండ్రి వివరాలు లేవన్న కారణంతో విద్యకు, ఉపకార వేతనాలకు, ప్రభుత్వ సేవలకు దూరం చేయడం ఎంతవరకు సమంజసం? దశాబ్దాలుగా ప్రభుత్వ దరఖాస్తుల్లో కొనసాగుతున్న ఈ వివక్షాపూరిత విధానంపై ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ గళమెత్తారు. చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. తండ్రి పేరు లేదనే ఒక్క కారణంతో ఏ చిన్నారి హక్కులకూ భంగం కలగకూడదని స్పష్టం చేశారు.
విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఒంటరి తల్లుల పిల్లలకే ఎక్కువ ఇబ్బందులు..

ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు సమర్పించాలన్నా, పాఠశాలలో ప్రవేశం పొందాలన్నా, ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా తండ్రి పేరు తప్పనిసరిగా అడుగుతున్న పరిస్థితులు అనేక కుటుంబాలకు శాపంగా మారుతున్నాయని శైలజ పేర్కొన్నారు. ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు ఈ నిబంధన కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి వివరాలు లేవని పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడం సరికాదన్నారు. చట్టపరంగా అవసరం లేని చోట తల్లి పేరు లేదా చట్టబద్ధ సంరక్షకుల పేరును ప్రత్యామ్నాయంగా అనుమతించాలని సూచించారు.

అన్ని శాఖలకు ఒకే విధానం ఉండాలి..

ఒక్కో ప్రభుత్వ శాఖ ఒక్కో రకమైన నిబంధన అమలు చేస్తే సమస్య మరింత జటిలమవుతుందని శైలజ అభిప్రాయపడ్డారు. మహిళా కమిషన్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి అన్ని శాఖలకు వర్తించేలా సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ దరఖాస్తులు, ఆన్‌లైన్ పోర్టళ్లలో అవసరమైన మార్పులు చేయడంతో పాటు క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.

పిల్లల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు..

తండ్రి పేరు, కుటుంబ పరిస్థితుల గురించి పదేపదే ప్రశ్నించడం చిన్నారుల్లో మానసిక ఆందోళన, అవమాన భావనకు దారితీస్తుందని శైలజ హెచ్చరించారు. కుటుంబ నేపథ్యం ఏదైనా పిల్లల గౌరవం, వ్యక్తిగత గోప్యత, హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పిల్లల హక్కులకు కుటుంబ పరిస్థితులు అడ్డుకాకూడదు..

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వెటుకూరి ఏ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, ప్రత్యేక గుర్తింపు ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వైవాహిక స్థితిని బట్టి పిల్లల భవిష్యత్తును నిర్ణయించకూడదన్నారు.పాఠశాల ప్రవేశాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, గుర్తింపు పత్రాల జారీలో తండ్రి పేరు లేదనే కారణంతో ఏ ఒక్క సేవనూ నిరాకరించకూడదని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో బాలల హిత విధానాలను అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.కె. విజయలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, జువైనల్ వెల్ఫేర్, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ అధికారులు, వివిధ జిల్లాల బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్లు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయిమ్స్ భోజనంలో 'కాళ్ల జెర్రీ' కలకలం

- రోగుల బంధువులకు వడ్డించిన ఆహారంలో పురుగు

- క్యాంటీన్ నిర్వాహకులను నిలదీసిన బాధితుడు.. భోజనాల నిలిపివేత

- ఆహార నాణ్యతపై అనుమానాలు.. విచారణకు డిమాండ్



మంగళగిరి(ప్రశ్న న్యూస్) అత్యాధునిక వైద్య సేవలు అందించాల్సిన ప్రతిష్ఠాత్మక ఆసుపత్రిలో ఆహార భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మంగళగిరిలోని ఏయిమ్స్ ఆసుపత్రి క్యాంటీన్‌లో అందించిన భోజనంలో కాళ్ల జెర్రీ కనిపించిందని ఓ రోగి బంధువు ఆరోపించడం కలకలం రేపింది. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన వారికి, వారి వెంట ఉండే కుటుంబ సభ్యులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన క్యాంటీన్‌లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకుందని ఆరోపణలు రావడం ఆసుపత్రి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం మంగళగిరి ఏయిమ్స్‌కు వచ్చినట్లు తెలిపాడు. ఈ క్రమంలో ఆసుపత్రి క్యాంటీన్‌లో భోజనం తీసుకోగా, అందులో కాళ్ల జెర్రీ కనిపించిందని ఆరోపించాడు. ఆహారంలో పురుగు కనిపించడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన బాధితుడు క్యాంటీన్ సిబ్బందిని నిలదీశాడు.

నిలదీస్తే సమాధానం ఏది..

భోజనంలో పురుగు ఎలా వచ్చిందని ప్రశ్నించినప్పటికీ క్యాంటీన్ సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆసుపత్రి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా తగిన స్పందన లేదని ఆరోపించాడు. దీంతో క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా? వంట తయారీ నుంచి భోజనం వడ్డించే వరకు ఎలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ ఘటనపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో క్యాంటీన్ నిర్వాహకులు భోజనాల పంపిణీని నిలిపివేసి, డబ్బులు తిరిగి ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. అయితే భోజనాలు నిలిపివేయడం, డబ్బులు తిరిగి ఇవ్వడం మాత్రమే సమస్యకు పరిష్కారమా? ఆహారంలో పురుగు వచ్చిందన్న ఆరోపణపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతను నిర్ధారించాల్సిన అవసరం లేదా? అని రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు.

రోగుల బంధువుల ఆహార భద్రతకు భరోసా లేదా..

ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల వెంట కుటుంబ సభ్యులు, బంధువులు రోజులు తరబడి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి వారికి అందించే భోజనం పరిశుభ్రంగా, నాణ్యతతో ఉండటం అత్యంత అవసరం. ముఖ్యంగా వైద్య సేవల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆసుపత్రి క్యాంటీన్లపైనే ఆధారపడుతుంటాయి. అలాంటి చోట్ల ఆహారంలో పురుగులు కనిపిస్తున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళనకరం.క్యాంటీన్‌లో వంట చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉందా? ఆహార పదార్థాలను సరైన విధంగా నిల్వ చేస్తున్నారా.? వంట సిబ్బంది ఆహార భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా.? క్యాంటీన్‌కు అవసరమైన అనుమతులు, తనిఖీలు సక్రమంగా ఉన్నాయా.? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

అధికారుల తనిఖీలు ఎక్కడ..

ఏయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థలో ఆహార నాణ్యతపై ఇలాంటి ఆరోపణలు రావడం చిన్న విషయం కాదు. క్యాంటీన్ నిర్వహణపై ఆసుపత్రి యాజమాన్యం తక్షణమే స్పందించి, ఘటనకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలని బాధితులు కోరుతున్నారు. ఆహార భద్రతా అధికారులు క్యాంటీన్‌ను తనిఖీ చేసి, ఆహార నమూనాలను సేకరించి పరీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యుల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యం కోసం వచ్చిన వారికి భోజనంలోనూ భరోసా లేకపోతే ఎలా..

రోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే ఆసుపత్రిలోనే ఆహార భద్రతపై అనుమానాలు వ్యక్తమవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై ఏయిమ్స్ యాజమాన్యం అధికారికంగా స్పందిస్తుందా? క్యాంటీన్ నిర్వహణపై విచారణకు ఆదేశిస్తుందా? ఆహార నాణ్యతను నిర్ధారించే చర్యలు చేపడుతుందా? అన్నది వేచి చూడాలి. ఆరోపణల నిజానిజాలు తేల్చి, రోగుల బంధువులకు సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంపై ఉంది.

అపమృత్యు భయాలను తొలగించే భగినీ హస్త భోజనం



భారతీయ సంస్కృతిలో బంధాలకు, ఆచారాలకు అత్యున్నత ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య పవిత్ర ప్రేమను, అనుబంధాన్ని చాటి చెప్పే పండుగల్లో భగినీ హస్త భోజనం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కార్తీక మాసంలో వచ్చే కార్తీక శుద్ధ విదియ తిథిని యమ ద్వితీయ అంటారు. ఈ రోజున సోదరి ఇంటికి సోదరులు వెళ్లి భోజనం చేయడం వల్ల అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల మధ్య ఉన్న పవిత్రమైన బంధం బలంగా మారుతుందని ప్రగాఢ విశ్వాసం. దీపావళి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా కార్తీక మాసంలో శుద్ధ విదియ రోజున యమ ద్వితీయ లేదా భగినీ హస్త భోజనంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇందుకు సంబంధించిన అనేక పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి.

మార్కండేయుని కథ

పరమశివుని భక్తుడైన మార్కండేయుడు అల్పాయుష్కుడు. ఆ సంగతి తెలిసి అతను పరమశివుని శరణు వేడుతాడు. మార్కండేయుని అంత్యకాలం సమీపించడం వల్ల యమధర్మరాజు అతని ప్రాణాలు తీయడానికి యమపాశాన్ని విసరబోగా, పరమశివుడు మార్కండేయుడు తనను శరణు జోచ్చాడు కాబట్టి అతనిని విడిచి పెట్టమని హెచ్చరిస్తాడు. కానీ జీవుల మరణాల పట్ల ఖచ్చితంగా, పక్షపాతం లేకుండా వ్యవహరించే యముడు అందుకు ఒప్పుకోడు. మార్కండేయుడు ప్రాణాలు తీయటానికి యమపాశాన్ని విసురుతాడు. భయంతో మార్కండేయుడు శివలింగాన్ని ఆలింగనం చేసుకోవడంతో ఆ పాశం వెళ్లి శివలింగాన్ని తాకుతుంది. తన భక్తున్ని విడిచి పెట్టమని చెప్పిన వినకుండా, నేరుగా తన శివలింగం మీదకే పాశాన్ని విసిరిన యమధర్మరాజుపై శివుడు ఆగ్రహించి తన త్రిశూలాన్ని విసురడంతో, త్రిశూలం శక్తి ఎంతటిదో తెలిసిన యముడు దాని ధాటి నుంచి తప్పించుకోవటానికి ఏమి చేయాలో అర్థం కాని యమధర్మరాజు పరుగెత్తి, పరుగెత్తి చివరకు అనుకోకుండా తన చెల్లెలు యమున ఇంటికి వెళ్లి తలదాచుకుంటాడు.అన్న రాకను చూసిన యమున ఎన్నిసార్లు పిలిచినా రాని అన్న ఇలా అకస్మాత్తుగా తన ఇంటికి రావడం వల్ల ఆనందంతో ఉబ్బితబ్బిబై అతనికి సకల మర్యాదలు చేస్తుంది. దీంతో యముడు చెల్లెల్ని చూసి ఆనందపడి శివుడు త్రిశూలంతో వెంటాడడం గురించి మర్చిపోతాడు. చెల్లెలి చూపించే ఆదరణకు పరవశించిపోతాడు. చెల్లెలు ప్రేమగా రుచికరమైన పిండివంటలతో విందు వడ్డిస్తుంటుంటే పరవశించిపోతు ఆరగిస్తాడు. ఇదే సమయంలో త్రిశూలంతో వెంబడిస్తున్న పరమేశ్వరుడు అక్కడ అన్నా చెల్లెళ్ల బంధాన్ని, అనుబంధాన్ని చూసి ఒకేసారి ఇద్దరినీ అనుగ్రహిస్తాడు. ఈ ఘటనతో రెండు ఉపకారాలు జరిగాయి. ఇటు మార్కండేయుని ప్రాణాలు నిలిచాయి. మార్కండేయుడు చిరంజీవిగా చిరకాలం జీవించాడు. రెండోది ఎంత పిలిచినా చెల్లెలి ఇంటికి వెళ్లని యముడు తొలిసారిగా చెల్లెలి ఇంటికి వెళ్లి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరిస్తాడు. అన్నకు తృప్తికరంగా భోజనం పెట్టాలన్న యమున చిరకాల వాంఛ నెరవేరుతుంది.

యమునకు యమధర్మరాజు ఇచ్చిన వరం

శివుడి ఆగ్రహానికి గురి కాకుండా తనకు రక్షణ కల్పించి, తన కోసం చెల్లెలు చేసిన అతిథి మర్యాదలకు యముడు ముగ్ధుడై తన చెల్లెలు యమునను తనకు ఇష్టమైన వరం కోరుకోమంటాడు. అప్పుడు యమున కార్తీక శుద్ధ విదియ రోజు చెల్లెలి ఇంటికి వెళ్లి, ఆమె చేతి వంట తినే సోదరుడికి నరకలోక వాసం తప్పించి, అపమృత్యు దోషం కలగకుండా ఉండేలాగా వరం ఇవ్వమని కోరుకుంటుంది. అలాగే ఈ రోజున అతిథి మర్యాదలతో అన్నను ఆదరించిన సోదరికి సౌభాగ్యాలు కలిగేలా దీవించమని కోరుతుంది. చెల్లెలి కోరిక విన్న యముడు పరమానంద భరితుడై తథాస్తు అంటాడు. అలా ప్రతీ ఏటా కార్తీక శుద్ధ విదియ నాడు చెల్లెలి ఇంటికి వచ్చి, ఆమె చేతి వంట తింటానని వరం ప్రసాదిస్తాడు. ఇదీ భగినీ హస్త భోజనము వెనుక ఉన్న కథ

పండుగ ఒక్కటే పేర్లు అనేకం



దేశ అతా పండుగను రకరకాల పేర్లతో జరుపుకుంటారు. అద్వితీయ పర్వదినంగా పేరు పొందింది కాబట్టి యమద్వితీయ అని, పుష్ప ద్వితీయ, కాంతి ద్వితీయ అని జరుపుకుంటారు. అలాగే ఉత్తర భారతంలో భాయ్ దూజ్ పేరిట జరుపుకుంటారు.కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే పండుగలునేటి యాంత్రిక యుగంలో అన్ని సంబంధాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, సంబంధ బాంధవ్యాలు పునరుద్ధరించి తద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ దృఢపడటానికి ఇలాంటి పండుగలు దోహదం చేస్తాయి. భగినీ హస్తభోజనం రోజు అన్నతమ్ములు తమ తమ సోదరి ఇంటికి చీరసారెలతో వెళ్లి ఆమె చేతి భోజనం తిని పది కాలాలు ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలతో చిరంజీవిగా వర్ధిల్లాలని కోరుకుంటు

నేర నియంత్రణపై నిఘా ఉంచుతూ .. ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను సమీక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు స్టేషన్ పరిధిలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేసులకు సంబంధించిన వాహనాలను భద్రపరచాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా ప్రతి రోజు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేంద్ర చారి, లక్ష్మి, సిబ్బంది ఉన్నారు

దాసోజు లక్ష్మమ్మ చిత్రపటానికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఘన నివాళి

డా. బి.వి. చారి కుటుంబానికి పరామర్శ ప్రగాఢ సానుభూతి

ఉప్పల్(ప్రశ్న న్యూస్)హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు డా. బి.వి. చారి అత్త దాసోజు లక్ష్మమ్మ ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వారి నివాసానికి విచ్చేసి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. బి.వి. చారి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.



బియ్యం ధరల మంట..
మధ్యతరగతి బతుకులు విలవిల

- సామాన్యుడి పళ్లెంలో అన్నం కూడా భారమేనా -ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలు, ఆదాయం పెరగదు.. ఖర్చులు తగ్గవు

- ధరల నియంత్రణలో అధికారుల ఉదాసీనతపై ప్రజాగ్రహం.. ప్రభుత్వాలు స్పందించేదెప్పుడు

(తోట వెంకట్ - ప్రశ్న న్యూస్ స్టేట్ బ్యూరో)

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి ఇంట్లో ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం ధరలు మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు నెలకు సరిపడా బియ్యం కొనుగోలు చేసి కుటుంబ అవసరాలను సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు బియ్యం దుకాణానికి వెళ్లాలంటేనే సామాన్యుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. కిలో బియ్యం ధర ఎంత.? తమకు నచ్చిన రకం కొనాలంటే ఎంత ఖర్చవుతుంది? నెలకు అవసరమైన బియ్యం కోసం ఎంత మొత్తం వెచ్చించాలి.? అనే లెక్కలతోనే కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది.

ఆదాయం ఒకటి.. ఖర్చులు కొండంత..

ప్రైవేటు ఉద్యోగులు, చిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, కూలీలు, పెన్షన్లపై ఆధారపడే కుటుంబాల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. నెలవారీ ఆదాయం పరిమితంగా ఉంటే ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ప్రయాణ ఖర్చులు, కూరగాయలు, పప్పులు, వంటనూనెల కొనుగోళ్లకే పెద్ద మొత్తంలో ఖర్చవుతోంది. వీటన్నింటికీ తోడు బియ్యం ధరల భారం చేరడంతో కుటుంబ నిర్వహణ కష్టసాధ్యమవుతోంది. జీతాలు పెరగకపోయినా మార్కెట్లో ధరలు మాత్రం పెరుగుతున్నాయనే భావన మధ్యతరగతి ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. చివరకు కుటుంబ అవసరాలను తగ్గించుకోవడం, నాణ్యమైన బియ్యం కొనుగోలుకు దూరంగా ఉండటం, తక్కువ ధరకు దొరికే రకాలతో సరిపెట్టుకోవడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి.

అన్నం పెట్టే బియ్యమే అందనంత దూరమా.?

భారతీయ కుటుంబాల ఆహారపు అలవాట్లలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కుటుంబాలకు అన్నమే ప్రధాన ఆహారం. అలాంటి బియ్యం ధరలు సామాన్యుల కొనుగోలు శక్తికి అందకుండా పోతున్నాయనే ఆవేదన వినిపిస్తోంది. పేదలకు ప్రభుత్వ రేషన్ ద్వారా కొంత ఉపశమనం లభిస్తున్నప్పటికీ, రేషన్‌పై పూర్తిగా ఆధారపడలేని మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ఏమిటన్నది కీలక ప్రశ్నగా మారుతోంది. ఉచిత రేషన్ అందని కుటుంబాలు, పరిమిత ఆదాయంతో జీవించే కుటుంబాలు మార్కెట్‌లోనే బియ్యం కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ధరల పెరుగుదల ప్రభావం నేరుగా వారి వంటగదిపై పడుతోంది.

వ్యాపారుల ఇష్టారాజ్యమా.. అధికారుల పర్యవేక్షణ లేదా.?

బియ్యం మార్కెట్‌లో వివిధ రకాల పేర్లతో విక్రయాలు జరుగుతున్నాయి. సన్న బియ్యం, దొడ్డు బియ్యం, సోనా మసూరి, ఇతర రకాల పేర్లతో ధరల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. అయితే ఒకే రకం బియ్యాన్ని వేర్వేరు దుకాణాల్లో వేర్వేరు ధరలకు విక్రయిస్తున్నారా.? నాణ్యతకు అనుగుణంగానే ధరలు నిర్ణయిస్తున్నారా.? వినియోగదారులకు సరైన బిల్లులు ఇస్తున్నారా.? అనే అంశాలపై సమగ్ర పర్యవేక్షణ అవసరం. ధరల విషయంలో పారదర్శకత లేకపోతే వినియోగదారుడు నష్టపోయే ప్రమాదం ఉంది. వ్యాపారులు తమకు నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తే సంబంధిత అధికారులు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన బాధ్యత ఉంది.

కలెక్టర్ల పర్యవేక్షణ ఏమైంది.?

జిల్లా స్థాయిలో ప్రజా సమస్యలపై స్పందించాల్సిన కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత మార్కెటింగ్ విభాగాలు బియ్యం ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉంది. జిల్లాల్లో హోల్‌సేల్ మార్కెట్లు, రైస్ మిల్లులు, గోదాములు, రిటైల్ దుకాణాల్లో నిల్వలు, సరఫరా, ధరల వివరాలను పరిశీలించాలి. ఎక్కడైనా అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం, తప్పుడు తూకాలు, నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయా అనే అంశాలను తనిఖీల ద్వారా నిర్ధారించాలి. అయితే ధరల నియంత్రణ పేరుతో చట్టపరమైన పరిమితులకు మించి వ్యవహరించడం కాకుండా, అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అందుబాటు ధరల్లో బియ్యం లభించేలా మార్కెట్ పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి.

రాజకీయ నాయకులకు కనిపించని వంటింటి సమస్యలు..

ఎన్నికల సమయంలో సామాన్యుడి కష్టాలు, కుటుంబాల సంక్షేమం, పేదల అభ్యున్నతి గురించి నాయకులు ఎన్నో హామీలు ఇస్తుంటారు. కానీ నిత్యావసర ధరలు పెరిగినప్పుడు అదే సామాన్యుడి బాధలను ఎంతమంది ప్రజాప్రతినిధులు పట్టించుకుంటున్నారు.? నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు బియ్యం ధరలపై సమీక్ష నిర్వహించలేరా.? పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమై మార్కెట్ పరిస్థితిని తెలుసుకోలేరా.? ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు కూడా బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అయితే, ప్రజలకు ఉపశమనం కల్పించడం పాలకుల బాధ్యత.

మధ్యతరగతి కుటుంబాల గోడు వినేదెవరు..

సంక్షేమ పథకాలు ఒకవైపు కొనసాగుతున్నా, అనేక పథకాల పరిధిలోకి రాని మధ్యతరగతి కుటుంబాల సమస్యలు ప్రత్యేకంగా చర్చకు రావాల్సిన అవసరం ఉంది. అధిక ఆదాయం లేకపోయినా కొన్ని ప్రభుత్వ అర్హతల కారణంగా సంక్షేమ పథకాలకు దూరమవుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కుటుంబాలకు మార్కెట్ ధరలే ఆధారం. నెలకు వచ్చే ఆదాయంతోనే అన్ని అవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితిలో బియ్యం ధరలు పెరిగితే మొదట దెబ్బతినేది వారి కుటుంబ బడ్జెట్టే. పిల్లల చదువుల ఖర్చు తగ్గించలేరు.. వైద్య ఖర్చులను వాయిదా వేయలేరు..

ఇంటి అద్దె చెల్లించకుండా ఉండలేరు. చివరకు ఆహార ఖర్చుల విషయంలోనే రాజీ పడాల్సి వస్తోంది. ఇది కేవలం ధరల సమస్య కాదు.. కుటుంబాల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే అంశం.

ప్రభుత్వం తక్షణం చేపట్టాల్సిన చర్యలివే..

బియ్యం ధరలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అధ్యయనం చేపట్టాలి. జిల్లాలవారీగా వివిధ రకాల బియ్యం హోల్‌సేల్, రిటైల్ ధరలను



సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రైస్ మిల్లుల నుంచి మార్కెట్లకు సరఫరా ఎలా జరుగుతోంది.? మధ్యవర్తుల పాత్ర ఎంతవరకు ఉంది.? నిల్వలు సరిపడా ఉన్నాయా? రవాణా ఖర్చులు ధరల పెరుగుదలకు ఎంతవరకు కారణమవుతున్నాయి.? అనే అంశాలను పరిశీలించాలి. అవసరమైతే రైతులు, మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటు ధరల బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలి. వినియోగదారుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి.

అన్నం అందించలేని పాలనపై ప్రశ్నలు తప్పవా..

ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎంత ముఖ్యమో ప్రజలకు నిత్యావసర ఆహార పదార్థాలు అందుబాటు ధరల్లో లభించేలా చూడటం కూడా అంతే ముఖ్యం. ఆకలి, ఆహారం, కుటుంబ పోషణ అనేవి రాజకీయాలకు అతీతమైన అంశాలు. బియ్యం కొనుగోలు చేయలేక మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయనే ఆవేదనను పాలకులు తేలిగ్గా తీసుకోకూడదు. ధరల పెరుగుదలకు వాస్తవ కారణాలను గుర్తించి తగిన పరిష్కారాలు చూపాలి. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

మార్కెట్‌లో పోటీ, నాణ్యత, సరఫరా, ధరల పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి. బంగారు భవిష్యత్తు, అభివృద్ధి చెందిన రాష్ట్రం, సంక్షేమ పాలన అంటూ ఎన్నో లక్ష్యాలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు ముందుగా సామాన్యుడి పళ్లెంలో అన్నం అందుబాటులో ఉందా లేదా అన్నది ఆలోచించాలి. సంపాదనలో ఎక్కువ భాగం తిండికే ఖర్చు చేయాల్సి వస్తే కుటుంబాలు ఎలా అభివృద్ధి చెందుతాయి.? బియ్యం కొనలేని పరిస్థితి వస్తే సామాన్యుడు ఎవరిని ఆశ్రయించాలి? ధరల నియంత్రణ బాధ్యత ఎవరిది? ప్రజల ఆకలి బాధలను పట్టించుకోని పాలనపై ప్రశ్నలు రావడం సహజం. వ్యాపారులకు లాభాలు, వినియోగదారులకు భారాలు, ఇదేనా నిత్యావసర మార్కెట్ పరిస్థితి.

కేకుల మాటున కల్తీ కహానీ

- మాదాపూర్ బేకింగోలో బాగోతం

-60 కిలోల కాలం చెల్లిన కేక్ బేస్‌లు స్వాధీనం

-గడువు ముగిసిన పదార్థాలతో కేకుల తయారీ.. డేట్ లేబుళ్లలోనూ మాయాజాలం

-నవంబర్ 10తో ముగిసిన గడువు.. 12 వరకు వినియోగించుకోవచ్చంటూ తప్పుడు ముద్రలు

-మాదాపూర్ అవుట్‌లెట్‌పై టీజీ ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు

- క్లౌడ్ కిచెన్లపై నిఘా.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలంటూ హెచ్చరిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో కల్తీ దందాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియాపై టీజీ సేఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ అక్రమాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. లాభాలే పరమావధిగా పెట్టుకుని ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న వ్యాపారుల వ్యవహారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరిస్తున్నా, ఆహార కల్తీ ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తాజాగా హైదరాబాద్‌లో ప్రముఖ బేకరీ బ్రాండ్‌గా పేరొందిన 'బేకింగో' అవుట్‌లెట్‌లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి.



మాదాపూర్‌లోని బేకింగో అవుట్‌లెట్‌పై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, గడువు ముగిసిన సుమారు 60 కిలోల కేక్ బేస్‌లు గుర్తించారు. వాటిని అధికారులు వెంటనే అక్కడికక్కడే పారబోసి ధ్వంసం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీ, నిల్వ విషయంలో పాటించాల్సిన నిబంధనలను తుంగలో తొక్కినట్లు తనిఖీల్లో వెల్లడైంది.



- డేట్ లేబుళ్లలోనూ మాయాజాలం..

ఈ తనిఖీల్లో మరింత విస్తుపోయే అంశం వెలుగులోకి వచ్చింది. నవంబర్ 10, 2026 నాటికే గడువు ముగిసిన కేక్ బేస్‌లను వినియోగిస్తూ, వాటితో తయారుచేసిన కేకులపై నవంబర్ 12 వరకు వినియోగించుకోవచ్చనే విధంగా డ్యూ డేట్ లేబుళ్లు ముద్రించినట్లు అధికారులు గుర్తించారు. అంటే గడువు ముగిసిన ముడి పదార్థాలను ఉపయోగించడమే కాకుండా, వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా లేబుళ్ల వ్యవహారం సాగినట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ పరిణామం ఆహార పదార్థాల భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది.



- ఆన్‌లైన్ ఆర్డర్లతో అప్రమత్తత అవసరం

మారుతున్న జీవనశైలితో నగరవాసులు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. భోజనం నుంచి కూరగాయలు, కేకులు, ఇతర ఆహార పదార్థాల వరకు ఇంటి వద్దకే తెప్పించుకుంటున్నారు. అయితే వాటిని ఎక్కడ తయారు చేస్తున్నారు.? ఎలాంటి వాతావరణంలో నిల్వ చేస్తున్నారు.? పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా.? అనే అంశాలను చాలామంది పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా నగరంలో క్లౌడ్ కిచెన్ వ్యవస్థ విస్తరిస్తున్న నేపథ్యంలో ఆహార తయారీ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమవుతోంది. ఈ నేపథ్యంలోనే క్లౌడ్ కిచెన్లు, ఆన్‌లైన్ ఫుడ్ అవుట్‌లెట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆహార భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మరోవైపు బేకింగో అవుట్‌లెట్‌లో తనిఖీలకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ఉత్తర భారతాన్ని కమ్మేసిన
విషపూరిత పొగమంచు

- బయటపెట్టిన ఉపగ్రహ చిత్రాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉత్తర భారతదేశంలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. దీపావళి పండుగ ముగిసిన రెండు రోజుల తర్వాత కూడా ఉత్తరాదిలోని అత్యధిక ప్రాంతాలను దట్టమైన పొగమంచు (స్మాగ్) కమ్మేసింది. అంతరిక్షం నుంచి తీసిన ఉపగ్రహ చిత్రాల్లో ఈ కాలుష్య మేఘాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నాసా వరల్డ్‌వ్యూ తాజా చిత్రాల ద్వారా వెల్లడైంది. నాసా విడుదల చేసిన నవంబర్ 10 చిత్రాల ప్రకారం దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, వాటి సమీప రాష్ట్రాల్లో ఈ పొగమంచు ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. ఇది మైదాన ప్రాంతాలకే పరిమితం కాకుండా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ వంటి హిమాలయ పర్వత ప్రాంతాల వరకు విస్తరించింది. మరోవైపు మధ్య, దక్షిణ భారతదేశంలోనూ దీని ప్రభావం కొంతమేర కనిపించినప్పటికీ, తీవ్రత తక్కువగానే ఉంది. అయితే రాజస్థాన్, గుజరాత్ వంటి పశ్చిమ రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో వాతావరణం చాలావరకు నిర్మలంగా ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి.దీపావళి నాటి నుంచి దేశంలోని వాయు పరిస్థితులను పరిశీలిస్తే గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. నవంబర్ 8న పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఇతర ఉత్తరాది ప్రాంతాలను దట్టమైన పొగ కప్పేసింది. నవంబర్ 9 నాటికి ఈ పొగ కొంత పలుచబడి పలు ఉత్తరాది రాష్ట్రాలు, బీహార్, పర్వత ప్రాంతాల మీదుగా విస్తరించింది. ఇక నవంబర్ 10 నాటికి ఇది మరింత విస్తృతమై, దేశంలోని విశాల భూభాగాన్ని దట్టమైన బూడిద రంగు దుప్పటిలా కప్పేసినట్లు నమోదైంది. శీతాకాలం ప్రారంభం కావడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాటు వాతావరణ పరిస్థితుల వల్ల కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. దీనికి తోడు పొలాల్లో వ్యర్థాలు తగులబెట్టడం (స్టబుల్ బర్నింగ్), బాణసంచా పొగ, వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలు తోడవ్వడంతో నవంబర్ మొదటి వారం నుంచే కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది.ఈ తీవ్ర పరిస్థితుల నడుమ దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత స్వల్పంగా మెరుగుపడటం కొంత ఊరటనిచ్చింది. మంగళవారం గాలుల వేగం పెరగడంతో ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 299 వద్ద నమోదైంది. అంతకుముందు రోజు ఇది 376 పాయింట్లతో "చాలా తీవ్రమైన" (వెరీ పూర్) కేటగిరీలో ఉండగా, తాజాగా "పూర్" విభాగానికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఏక్యూఐ 201 నుంచి 300 మధ్య ఉంటే 'పూర్' అని, 301 నుంచి 400 మధ్య ఉంటే 'వెరీ పూర్'గా పరిగణిస్తారు. ప్రస్తుతానికి గాలి నాణ్యత కాస్త మెరుగైనప్పటికీ, కాలుష్య ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.?

నక్సల్ రహిత భారత్ తర్వాత
ఇదే మన ప్రధాన లక్ష్యం

- దేశవ్యాప్తంగా 2029 నాటికి డ్రగ్ ఫ్రీ ఇండియా సాధన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత (డ్రగ్ ఫ్రీ) రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధితులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.

అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం

- భయాందోళనలో స్థానికులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. చెరువు పరిసరాల్లో తరచూ మొసళ్లు కనిపిస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా మంగళవారం నాడు కూడా చెరువు నడిబొడ్డున ఉన్న ఒక మట్టి దిబ్బపై మొసలి సేదతీరుతూ కనిపించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సుమారు వారం రోజుల క్రితం కూడా చెరువు సమీపంలోని రోడ్డుపై ఒక మొసలి వెళ్లడాన్ని వాహనదారులు, గ్రామస్తులు గమనించారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండటంతో చెరువు పరిసర ప్రాంతాల్లో తిరగాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఈ చెరువు వద్దకు రైతులు తమ పశువులను నీటి కోసం తోలుకెళుతుంటారు. అలాగే నిత్యం గ్రామస్తుల రాకపోకలు కూడా ఇక్కడ ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎటువైపు నుంచి మొసలి దాడి చేస్తుందోనని పశువుల కాపరులు, స్థానికులు తీవ్ర భయంతో గడుపుతున్నారు.ఇప్పటివరకు ఎలాంటి దాడులు గానీ, ప్రమాదాలు గానీ జరగనప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. మొసళ్లు నీటిలో నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి సైతం సంచరిస్తుండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఈ పరిస్థితిపై అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువులో ఉన్న మొసళ్లను సురక్షితంగా పట్టుకుని, వాటిని సమీపంలోని మంజీరా నదిలోకి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటేనే తమకు, తమ పశువులకు రక్షణ ఉంటుందని స్థానిక రైతులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588